




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 285 | కర్నూలు | బుధవారం నవంబర్12 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi








## తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రబృందం పరిశీలన

### పలు జిల్లాల్లో నష్టాన్ని అంచనా వేసిన అధికారులు
### సిఎం చంద్రబాబుతో బృందం సభ్యుల భేటీ



అమరావతి,నవంబర్11(శ్రీచక్ర) : మొంథా తుఫాను నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కేంద్ర బృందం కలిసింది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు నేతృత్వంలోసీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రితో కేంద్ర బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి నష్టాన్ని అంచనా వేసింది. కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాలను సందర్శించింది. రూ.5,267 కోట్ల మేర తుఫాను నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. తక్షణ సాయంగా రూ.2,622 కోట్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని సర్కార్ కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుఫాను కారణంగా ప్రభావితం అయ్యాయని కూటమి ప్రభుత్వం పేర్కొంది. దాదాపు 10 లక్షల మంది తుఫాను, భారీ వర్షాలకు ప్రభావితం అయ్యారని నివేదికలో వెల్లడించింది. 9960 ఇళ్లు నీట మునిగాయని, 1.11 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని సర్కార్ పేర్కొంది. తుఫానుతో పాటు భారీ వర్షం కారణంగా 4566 ఇళ్లు దెబ్బతిన్నాయని స్పష్టం చేసింది. దాదాపు 1.61 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని.. 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారని కేంద్రానికి నివేదించింది. వ్యవసాయ పంటలతో పాటు ఆక్వా, పశు సంవర్ధకం, చేనేత రంగం కూడా తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించింది. 794 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, 12,856 విద్యుత్ స్తంభాలు నేల కూలినట్టు స్పష్టం చేసింది. అలాగే 2,318 ట్రాన్సఫార్మర్లు పాడయ్యాయని నివేదికలో పేర్కొంది. మొంథా తుఫాను కారణంగా పంటలు, రహదారులు, ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.6,384 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించింది. తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు 22 జిల్లాల్లో 1.92 లక్షల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించామని వెల్లడించింది. 3.36 లక్షల కుటుంబా లకు రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయంగా అందించినట్టు కేంద్ర బృందానికి ప్రభుత్వం తెలియజేసింది.

## ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తా




### లక్షమంది మహిళలను వ్యస్థాపకులుగా తీర్చిదిద్దుతా
### ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ఒంగోలు,నవంబర్11(శ్రీచక్ర) : ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. అలాగే చిన్నతరహార పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానికంగా ఉన్న అవకాశాలు వినియోగించుకుని యువత ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో మహిళలు కూడా అవాకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త పరికరాలను విద్యార్థులు తయారుచేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో సీఎం పర్యటించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇవాళ 329 ఎకరాల్లో 15 పారిశ్రామిక పార్కులను సీఎం ప్రారంభించారు. 587 ఎకరాల్లో మిగిలిన 35 ప్రభుత్వ, ప్రైవేటు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండం నాయునపల్లిలో చేనేత పార్కుకూ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగం చేస్తున్నాం. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. వారు ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి వారికి అప్పగిస్తున్నాం. రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మిస్తాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నాం. పెట్టుబడులు తీసుకొచ్చి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నాం. 20 లక్షల ఉద్యోగాలంటే చాలా మంది అవహేళన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ వారమంతా పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. కష్టపడి పనిచేసే అద్భుత యువత ఏపీలో ఉంది. గత వైకాపా పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడంతో వారు పారిపోయారని చంద్రబాబు అన్నారు. ఇకపోతే పలు జిల్లాల్లో మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఆజాద్‌కు నివాళి అర్పించిన చంద్రబాబు



అమరావతి,నవంబర్11(శ్రీచక్ర) :స్వాతంత్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ క్రమంలోనే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి నివాళి అర్పించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ట్వీట్ పెట్టారు. సంస్కరణలతో దేశ విద్యా వ్యవస్థకు పునాది వేసిన స్వాతంత్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నానని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ జాతీయ విద్యా దినోత్సవ, మైనార్టీ సంక్షేమ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు సీఎం చంద్రబాబు.

## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు అవసరం

### ఎక్స్ వేదికగా డిప్యూటీ సిఎం పవన్ ఆశాభావం



అమరావతి,నవంబర్11(శ్రీచక్ర) సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. సెక్యులరిజం రెండు మార్గాల్లో ఉంటుందని, మత విశ్వాసాల రక్షణ, గౌరవం అంశంలో రాజీ ఉండదని ఆయన అన్నారు. మన సనాతన ధర్మం అత్యంత ప్రాచీనమైందని, నాగరికతతో ఆ ధర్మం వర్ధిల్లుతున్నదని, ఇలాంటి సమయాల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఎక్స్ అకౌంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం కోసం ఆ బోర్డు ఉండాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం యాత్రా స్థలం మాత్రమే కాదు అని, అది పవిత్ర ఆధ్యాత్మిక యాత్రకు కేంద్రమని, తిరుపతి లడ్డూ కేవలం స్వీటు మాత్రమే కాదు అని, అదొక భావోద్వేగం అన్నారు. మన స్నేహితులు, కుటుంబీకులు, దగ్గరవారికి ఆ లడ్డూను ఎంతో ప్రేమతో పంచిపెడుతామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మనలో ఉన్న సామూహిక నమ్మకానికి, విశ్వాసాన్ని చాటుతుందన్నారు. ప్రతి ఏడాది సగటును 2. 5 కోట్ల మంది భక్తుల తిరుమలను దర్శించుకుంటారని, సనాతన విధానాలు అవలంబిస్తున్న వారి మనోభావాలను దెబ్బతీయాలని చూసినా, లేక హేళన చేసినా, అది కేవలం బాధను మాత్రమే కలిగించదు అని, లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసినట్లు అవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఎక్స్‌లో తిరుపతి లడ్డూపై ఓ పత్రిక రాసిన కథనాన్ని రీపోస్టు చేశారు.

## కర్నూలులో అతిపెద్ద బెవరేజస్ ఫ్యాక్టరీ

### ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రాజెక్ట్
### శంకుస్థాపనలో మంత్రి టిజి భరత్ వెల్లడి

కర్నూలు,నవంబర్11(శ్రీచక్ర) కర్నూలు జిల్లా బ్రాహ్మణపల్లిలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణపల్లిలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ప్రపంచంలో రెండవ అతిపెద్ద బేవరేజస్ ప్లాంట్ కర్నూల్ జిల్లాకు తీసుకొచ్చామన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమైందని తెలిపారు. మెక్సికో తర్వాత రెండో ప్లాంట్ కర్నూలుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద రెండో ప్రాజెక్ట్ కర్నూలులో నెలకొల్పుతున్నారని తెలిపారు. మూడు వేల కోట్లతో రిలయన్స్ కర్నూలులో పెట్టుబడులు పెడుతోందని... దాదాపు ఐదు వేల మందికి ఉపాధి లభించనుందని వెల్లడించారు.కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ప్లాంట్‌ను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్లాంట్ రావడం వల్ల స్థానిక యువతకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎయిర్ పోర్ట్‌లో శిక్షణా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సిగాచి కెమికల్స్ ఓర్వకల్లుకు కెమికల్ ఎ÷-లాంట్ వచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాల్లో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ తెలిపారన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు రూ.23 కోట్లతో మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. సీబీఎన్ బ్రాండ్‌తోనే పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు కొనసాగితే ఏపీ అభివృద్ధిలో దూసుకెళ్తుందని.. అలాంటి లీడర్ నాయకత్వాన్ని మళ్ళీ గెలిపించుకోవాలని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

## యువత భవిష్యత్ కోసమే కూటమి కృషి

### సంస్థల ఏర్పాటుతో యువతకు ఉద్యోగావకాశాలు
### గూగుల్ రాకతో మారనున్న ఎపి ముఖచిత్రం: కేశవ్

అనంతపురం,నవంబర్11(శ్రీచక్ర) యువత భవిత కోసవే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సెరికల్చర్ కార్యాలయ ప్రాంగణంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పయ్యావుల మాట్లాడుతూ.. ఈనెల 13, 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే వ్యాపార భాగస్వామ్య సదస్సుకు 51 దేశాల నుంచి వస్తున్నారని.. ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను అధిగమించి చంద్రబాబు నాయుడు బ్రాండ్ చూసి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు.




గూగుల్ సంస్థ అమెరికా తర్వాత ఏపీలో అతిపెద్ద పెట్టుబడి పెట్టిందని చెప్పుకొచ్చారు. కేవలం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇక్కడికి వచ్చినట్లు మంత్రి తెలిపారు.గతంలో మైక్రోసాఫ్ట్ తెస్తే యువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు వచ్చాయని గుర్తుచేశారు. తాజాగా ఏఐ వచ్చాక గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. గూగుల్‌తో పాటు ఏఐని వాడుకునే ఇతర పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు. ఇది మూడుతరాల వారిని అదుకుంటుందని తెలిపారు. జగన్ చెప్పినట్లు నాలుగు రేకులు వేసే షెడ్ కాదని వ్యాఖ్యలు చేశారు. విశాఖ ప్రపంచంలోనే పెద్ద డేటా సెంటర్ కాబోతోందన్నారు. భవిష్యత్‌తరాలు ఎలా బాగుపడతాయని జగన్ ఆలోచిస్తే బాగుంటుందని హితవు పలికారు.

## గత ఐదేళ్లలో పెట్టుబడులకు భయపడ్డారు

### ఇప్పుడు సానుకూల వాతావరణంతో రాక
### కాకినాడలో పలు సంస్థలకు మంత్రి నారాయణ శంకుస్థాపన



కాకినాడ,నవంబర్11(శ్రీచక్ర) గత ఐదేళ్లలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని.. ఇక్కడ ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోయారని మంత్రి నారాయణ అన్నారు. జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. కాకినాడ పోర్టులో ఎమ్ఏటీ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ, పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, తునిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ..పెట్టుబడిదారులు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సరిగా ఉందో లేదో ముందుగా చూసుకుంటారని తెలిపారు. గత ఐదేళ్లలో ఏపీలో అరాచక పాలన ఉందని విదేశీ పెట్టుబడిదారులు చెప్పారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ముందుకెళ్తున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కూడా పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లి వచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేలా పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు జరుగనున్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో సీఎం ముందుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామని చెప్పారు. పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు కూడా ఇస్తున్నామన్నారు.

# సంపాదకీయం

## ఎన్నాళ్లీ మారణహోమం

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో బాంబు పేలుళ్లు జరిగాయి. ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర గేట్ -1 వద్ద పార్కింగ్ చేసిన ఓ కారులో పేలుళ్ళు జరిగాయి. ఈ ఘటనలో ఐదు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న దుకాణాల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన జరిగిన తర్వాత బాంబ్ స్క్వాడ్ బృందాలతో ఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు మొదలుపెట్టారు. మొదట్లో ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. పేలుడు ఘటనలో 8 మంది దుర్మరణం చెందారు. పేలుడు వల్ల 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారి శరీరాలు పూర్తిగా చిద్రమయ్యాయి. గాయపడిన వారిని ఎల్ ఎన్ జీ పీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో చాలావరకు వాహనాలు ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో దర్యాప్తు బృందాలు విచారణ మొదలుపెట్టాయి. ఈ పేలుడు వెనక ఉగ్ర ఉందేమోనన్న కోణంలో దర్యాప్తును మొదలు పెట్టాయి. ఆదివారం యాంటీ టెర్రరిజం స్క్వాడ్ విస్తృతంగా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఉగ్ర మూలాలు ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారిని అరెస్టు చేసిన తర్వాత ఒకరోజు వ్యవధిలో ఈ ఘటన జరగడం విశేషం. ఉగ్రవాదులు మనదేశంలో దాడులు జరపడానికి కుట్రలు పన్నారని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ దర్యాప్తులో తేలింది. పలు ప్రాంతాలలో ఉగ్రవాదులను దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇది జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రవాదులు ఉన్నారని దర్యాదు బృందం అధికారులు అనుమానిస్తున్నారు. లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. మన దేశంలో గడిచిన వారం రోజుల వ్యవధిలో ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నలుగురు డాక్టర్లు అరెస్టు అయ్యారు.. వీరి వద్ద నుంచి పోలీసులు ఏకంగా 2900 వందల కిలోల పేలుడు పదార్థాలను, రైఫిళ్ళు, పిస్టల్స్, రిసిన్, అమోనియం నైట్రేట్ వంటి విష పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.. ఈ పరిణామం జరిగిన గంటల వ్యవధిలోనే ఢిల్లీలో భారీ పేలుడు చోటుచేసుకుంది. వాస్తవానికి ఈ పేలుడు అనేక సంచలన విషయాలను బయటపెట్టింది. ఉగ్రవాద వ్యతిరేక బృందం నలుగు డాక్టర్లను అరెస్ట్ చేసిన తర్వాత.. ఉగ్ర కుట్ర బయటపడింది. ఢిల్లీ ప్రాంతంలోని ఫరీదాబాద్ లో ఆల్ ఫలాయ్ యూనివర్సిటీ లో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రథర్, గుజరాత్ లోని డాక్టర్ అహమ్మద్ మోహియుద్దీన్ సయ్యద్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర చెందిన మహిళ డాక్టర్ ను ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం అరెస్ట్ చేసింది.. జమ్ము కాశ్మీర్, ఫరీదాబాద్ ప్రాంతాలలో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు.. ఇందులో ఏకంగా నలుగురు పట్టుపడ్డారు. సమాజంలో వీరిని ఎవరు కూడా అనుమానించారనే ఉద్దేశంతోనే ఉగ్రవాద సంస్థలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. దేశవ్యాప్తంగా దాడులకు ప్రణాళిక రూపొందించారు. అరెస్ట్ అయిన వైద్యులు జైషే ఏ మహమ్మద్, అన్సార్ గజ్వతుల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థల తో సంబంధం ఉన్నట్టు విచారణలో తేలింది. డాక్టర్ కాబట్టి ఎవరూ అనుమానించరనే ఉద్దేశంతోనే వీరు ఉగ్రవాద సంస్థలకు టచ్ లో ఉండేవారని తెలుస్తోంది. ఇక అరెస్టు అయిన వారిలో ఇద్దరు డాక్టర్లు 2018 -2021 కాలంలో భారత భద్రతా దళాల దాడిలో గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స అందించారని తెలుస్తోంది.. ఇక ఇదే క్రమంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ మాడ్యూల్ మొత్తాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.. ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కూడా ఉగ్రదాడి అని అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో.. ఈ నలుగురు పట్టుబడ్డారు. దేశ రాజధానిలో పేలుడు జరిగిన నేపథ్యంలో ఈ ఘటన సంచలనంగా మారింది. సరిగ్గా ఆదివారం ఆముదంతో విషయం తయారు చేసే వందల మందిని చంపడానికి కుట్ర చేసిన హైదరాబాద్ ఉగ్రవాది సయ్యద్ అహ్మద్ మోహియుద్దీన్, మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ఘటన జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఆముదం గింజలను ప్రాసెస్ చేసి.. మిగిలిపోయిన వ్యర్థాలతో అత్యంత ప్రమాదకరమైన రైసిన్ అనే విష రసాయనాన్ని తయారు చేశారు. ఈ వ్యవహారం దర్యాప్తు బృందం అధికారుల విచారణలో తేలింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఇటీవల ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరు దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర చేశారని భద్రతా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్తాన్ కుట్రలు చేస్తోందని పేర్కొన్నాయి. అందులో భాగంగా భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో.. ఉగ్ర స్థావరాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపాయి. భారత సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర నివాసాలన ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పాయి

# అంగరంగవైభవంగా ఇంచార్జీల ప్రమాణస్వీకారోత్సవం









డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ రోజు డోన్ నియోజకవర్గ మండల, పట్టణ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా, జవజవలాడే ఉత్సాహంతో జరిగింది. ముందుగా తెలుగు దేశం జెండాను ఎగరవేసి, నందమూరి తారక రామారావు గారి చిత్రపటానికి పూలమాల అర్పించి, నిన్న ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్లలో మరణించిన వారికి నివాళులు సమర్పిస్తూ సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు హాజరై, నూతన ఇంచార్జీలతో ప్రమాణ స్వీకారం చేయించి, వారికి పార్టీ పట్ల విశ్వాసం, ప్రజల పట్ల నిబద్ధత, సేవా భావం కలిగిన నిజమైన కార్యకర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల మనసుల్లో నిలిచిన పార్టీ. మనందరం ఒకే కుటుంబం, పార్టీని స్థాపించిన మహానేత నందమూరి తారకరామారావు గారి స్ఫూర్తి ప్రతి కార్యకర్తలో ప్రజాసేవ పట్ల అంకితభావాన్ని రగిలిస్తోంది. ఆయన చూపిన ప్రజాహిత దిశ, విలువలు మన పార్టీ ఆత్మగా నిలిచాయి. అదే విధంగా, మన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారు చూపిన దూరదృష్టి, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిస్వార్థ నిబద్ధత ప్రతి తెలుగుదేశం కార్యకర్తకు స్ఫూర్తిదాయక మార్గదర్శకాలు. ఈ విలువలే మన పార్టీ బలం. ప్రతి బూత్ స్థాయిలో మన పసుపు జెండా ఎగురవేయడం మన కర్తవ్యం. ఇంచార్జీలుగా నియమితులైన మీ అందరికి ఇది కేవలం బాధ్యత మాత్రమే కాదు ఇది ఒక గౌరవం, నిబద్ధత, ప్రజా వ్రతం. మీరు ఇప్పుడు తెలుగుదేశం పార్టీ బలం, ప్రజల విశ్వాసం, నాయకుల ఆశలు మోసుకెళ్తున్న సైనికులు. ప్రజలతో మీరు నిర్మించే బంధమే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అందు వల్ల ప్రజల మధ్య ఎల్లప్పుడూ ఉండి, వారి సమస్యలు వినండి, వారి ఆశలు అర్థం చేసుకోండి, వాటి పరిష్కారం కోసం కృషి చేయండి. ప్రతి బూత్ ఒక కోటలా, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా, ప్రతి గ్రామం ఒక టీడీపీ బలంగా మారాలి. బూత్ స్థాయిలో క్రమపద్ధతిగాపని చేస్తే తెలుగుదేశం విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు. సేవ, సమర్పణ, సత్యం, శ్రమ ఇవే మన పార్టీ విజయ రహస్యం. ఈ సందర్భంగా కార్యకర్తలు నినాదాలతో పార్టీ కార్యాలయ్నా మార్మోగించారు. "పార్టీ కోసం ? ప్రజల కోసం!", జై కోట్ల, జై తెలుగు దేశం!" అంటూ గళమెత్తారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధి మన కల, మన కర్తవ్యం. ఆ కలను సాకారం చేసేందుకు ప్రతి కార్యకర్త ఒకటిగా, ఒక లక్ష్యంతో ముందుకు రావాలి. గ్రామం నుంచి పట్టణం వరకు, బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయివరకు మనం ఐక్యంగా పనిచేస్తే, మన నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. ప్రజల ఆశీర్వాదాలతో, కార్యకర్తల సమష్టి కృషితో, నాయకుల దిశానిర్దేశంతో ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం ఖాయం. ఈ మహోత్సవం కేవలం ప్రమాణ స్వీకారం కాదు ఇది ఒక కొత్త ప్రేరణ, కొత్త ఆరంభం, ప్రజాసేవకు కొత్త ప్రమాణం. డోన్ నియోజకవర్గం టీడీపీ జెండా కింద ఐక్యంగా నిలబడి, అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ప్రతి కార్యకర్త సంకల్పం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీసిటీని సందర్శించిన జర్మనీ వాణిజ్య ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, నవంబర్ 11(శ్రీచక్ర): జర్మనీలోని సాక్సోనీ రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణ శాఖ మంత్రి డిర్క్ పాంటర్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ చైర్మన్ శ్రీని రాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రపంచస్థాయి పారిశ్రామిక మౌళిక సదుపాయాలు, విభిన్న రంగాల పరిశ్రమల ఎకోసిస్టం, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఒనగూరే వ్యూహాత్మక వ్యాపార ప్రయోజనాలను డాక్టర్ సన్నారెడ్డి వివరించారు. 31 దేశాలకు చెందిన 240కి పైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్ ఫ్లేవర్స్ ఉ ఫ్రాగ్రెన్సెస్, క్నాఫ్, కాంక్యో బర్ట్ పరిశ్రమలు సైతం ఉన్నాయని వారి దృష్టికి తెచ్చారు. అలాగే భారత ప్రభుత్వం అందిస్తున్న పన్ను మినహాయింపులు, సబ్సిడీలు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (ప్లి) మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శ్రీసిటీలో పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అనుకూలతలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రణాళిక, మౌళిక సదుపాయాలు, పెట్టుబడి అనుకూల విధానాలను ప్రశంసించిన పాంటర్, భవిష్యత్తులో మరిన్ని జర్మన్ సంస్థలు ఇక్కడ కంపెనీలు నెలకొల్పడానికి ఆసక్తి చూపుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతినిధి బృందం స్థానిక బెల్ ఫ్లేవర్స్ ఉ ఫ్రాగ్రెన్సెస్ పరిశ్రమను సందర్శించి, కార్యకలాపాలను పరిశీలించింది. ఈ సందర్శన ప్రపంచ పెట్టుబడులకు ప్రముఖ గమ్యస్థానంగా శ్రీసిటీ స్థానాన్ని బలపరచడంతో పాటు భారత్, జర్మనీ దేశాల మధ్య వ్యాపార సంబంధాలకు పెంపొందిస్తాయి. సాక్సోనీ రాష్ట్ర వాణిజ్య అభివృద్ధి సంస్థ "విర్ట్స్ ఛాఫ్ట్" ఆధ్వర్యంలో సాగిన ఈ పర్యటనలో ప్రధానంగా దుస్తులు, మెటల్ ఉత్పత్తులు, వైద్య పరికరాల తయారీ, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ కార్యక్రమాలలో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించారు.

# చేనేతలకు బియ్యం సరకుల పంపిణీ

### రైతాంగం తర్వాత చేనేత కు పెద్ద పీఠ వేస్తున్న కూటమి ప్రభుత్వం.



శ్రీకాళహస్తి/వరదయ్యపాలెం, నవంబరు 11(శ్రీచక్ర)తుఫాను లో మగ్గం గుంత లోనికి నీరు వచ్చి,ముడి నరకులు దెబ్బతిని, నష్ట పోయినచేనేత కుటుంబాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన సేవా కార్యక్రమంలో భాగంగా చేనేతలకు బియ్యం సరకులను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి భాస్కర పేట లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి,రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ లు పాల్గొనగా, సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం పాల్గొని, స్వయంగా లబ్ధిదారులకు నరకులను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వినర్,డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు ప్రభుత్వం కు,ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. "చేనేత కుటుంబాలకు ఇది ఎంతో ఉపయుక్తమైన చర్య. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ చేనేతల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తోంది" అని త్యాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,చేనేత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.




# విద్యాభివృద్ధికి మౌలానా సేవలు చిరస్మరణీయం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు, నవంబర్ 11 (శ్రీచక్ర): భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చిరస్మరణీయ సేవలు అందించారని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కొనియాడారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆజాద్ జన్మదినం నవంబర్ 11న పురస్కరించుకుని మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్లు కొనసాగి ఆయన విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల తెచ్చారన్నారు. తద్వారా ఎంతోమంది విద్యార్థుల ఉన్నత విద్యను చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగారన్నారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి, మైనార్టీల సంక్షేమాన్ని ఎంతో కృషి చేస్తుందన్నారు. దేశ భవిష్యత్తును రూపొందించడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య భూమిక పోషిస్తుందని, నైపుణ్యంతో కూడిన చదువుల ద్వారానే మానవాభివృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రభుత్వాలు చదువుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, అందరూ విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చాలా కాలం పనిచేశారని, దేశంలో విద్యాభివృద్ధికి ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివప్రసాద్, డిసిపి వెంకటరమణ, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# త్రీ స్టార్ హోటల్ నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు



మంత్రాలయం , నవంబర్ 11,(శ్రీచక్ర) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రాలయంలో త్రీ స్టార్ హోటల్ ను వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా 3 స్టార్ హోటల్ ఎండి కార్తీక్, డిప్యూటీ జనరల్ మేనేజర్ తివారి లు త్రీ స్టార్ హోటల్ నమూనాలను ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ,ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర్ రెడ్డి, మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రాఘువేంద్ర రెడ్డి మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జి లకు చూపించారు

# పంచాయితి లలో ఆదాయ వనరులు సృష్టించాలి - ఇంచార్జి ఎంపిడిఓ జి. శ్రీనివాసు





జీలుగుమిల్లి నవంబర్ 11 (శ్రీ చక్ర)పంచాయతీ లోని గ్రామాల్లో ఆస్తి,ఇతర పన్నులతో సొంతంగా పంచాయతీలకు ఆదాయాలను సృష్టించాలని మండల అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో స్వీయ ఆదాయ వనరుల పై సర్పంచ్,పంచాయితి కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులైన పన్నులు,ఇతర మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు.కేంద్ర,రాష్ట్రాల నుంచి వచ్చే గ్రాంట్ల పై ఆధారపడకుండ స్థానిక వనరుల నుంచి ఆదాయాలు సమకూర్చుకోవాలని డిప్యూటీ ఎంపిడిఓ రవి కుమార్ సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఓ శ్రీనివాస్, డిప్యూటి ఎంపిడిఓ ఎల్.రవి,పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచ్ లు పాల్గొన్నారు...

# బుట్టాయగూడెంలో జరిగే పోలవరం నియోజకవర్గ వైసిపి ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

జీలుగుమిల్లి నవంబర్ 11 ( శ్రీ చక్ర) మాజీ ముఖ్యమంత్రి శ్రీ జూ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం మరియు పోలవరం నియోజకవర్గం మాజీ ఓ.ం శ్రీ తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లో జరుగుచున్న మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు వ్యతిరేకంగా రేపు అనగా బుధవారం నాడు బుట్టాయగూడెం మండల కేంద్రంలో నిర్వహించు నియోజకవర్గ భారీ ర్యాలీకి సంబంధించి పోస్టర్ ను జీలుగుమిల్లి గ్రామంలో మండల అధ్యక్షులు సందా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్ ను రిలీజ్ చేశారు.రేపటి భారీ ర్యాలీ కార్యక్రమంలో మండలం నుండి పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో జీలుగుమిల్లి సర్పంచ్ చిర్రి జగదాంబ,తాటియాకులగూడెం ఎంపిటిసి సున్నం సురేష్,కామయ్యపాలెం సర్పంచ్ బోడిక భోగేశ్వరావు,వైసిపి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యదర్శి బూరుగు ప్రేమ్ కుమార్,రాష్ట్ర ఆర్టీఐ కార్యదర్శి తగరం రాంబాబు ఎస్.టి సెల్ కుంజా చిన రాముడు,జిల్లా యువజన విభాగ సభ్యులు కొప్పుల ప్రసాద్,కక్కిరాల చక్రి,కొప్పుల సత్యనారాయణ, కుసుమ వెంకట్,కుమ్మరి టోనీ,సిరిబత్తుల భాస్కర్,సి.హెచ్ శ్రీను,గంగుల రమేష్,బొంతు వాసు,మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం


మంత్రాలయంలో త్రీ స్టార్ హోటల్ ను వర్చువల్ గా శంకుస్థాపన చేసిన సీఎం-ఆదోనిఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి -టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి





మంత్రాలయం నవంబర్ 11, (శ్రీచక్ర) : ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి ,మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి , జనసేన పార్టీ ఇంచార్జ్ బి లక్ష్మన్న లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మంత్రాలయంలోని పరిశ్రమలు ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రాలయంలో త్రీ స్టాల్ హోటల్ నిర్మాణానికి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి వారు అతిథులుగా విచ్చేశారు. ముందుగా వారు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాఘవేంద్రస్వామి ఆశీస్సులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ , టూరిజం శాఖ మంత్రి కందుల సురేష్ సహకారంతోదాదాపు రూ. వంద కోట్ల తో మంత్రాలయంలో త్రీ స్టార్ హోటల్ నిర్మించడం , రాష్ట్రంలో 87 ఎంయంఎస్ పార్కుల కు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక టూరిజం పాలసీ తీసుకువచ్చి మంత్రాలయం లో త్రీ స్టాల్ హోటల్ నిర్మించడంతో ఇక్కడ ఉన్న యువతకు ఉద్యోగు అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. టూరిజం లో భాగంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని వారి సౌకర్యం కొరకు త్రీ స్టార్ హోటల్ నిర్మించడం జరుగుతుందన్నారు. గత పాలనలలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదని విమర్శించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెట్టుబడులతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆబౌడి హోటల్ ఎండి ఆర్ యస్ కార్తీక , డిప్యూటీ జనరల్ మేనేజర్ తివారీ , హోటల్ మమేనేజర్ రజనీకాంత్ , సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ , తహశీల్దార్ రమాదేవి , ఎస్ఐ శివాంజుల్ ,ఎంపిడివో నూర్జుహాన్ , పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి , విద్యుత్ శాఖ ఏఈ గోవిందు , టీడీపీ నాయకులు చావిడి వెంకటేష్ , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య , కల్లుదేవకుంట సహకార సంఘం డైరెక్టర్ లక్ష్మన్న , మంచాలసొసైటీ డైరెక్టర్లు డిసి తిమ్మప్ప , చాపల నాగేష్ , పట్టణ అధ్యక్షులు వరదరాజు , కమ్మసాలి నరసింహ , రాఘవేంద్ర , శివ , ఎంపిటిసి మేకల వెంకటేష్ , నాలుగు మండల ముఖ్య నాయకులు , కార్యకర్తలు , పాల్గొన్నారు.

# జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలలో 4 పతకాలు సాధించిన పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి





భీమవరం నవంబర్ 10( శ్రీ చక్ర )పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలలో పతకాలతో మెరిసి జిల్లాకు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచారు. మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరులో అక్టోబర్ 11 12, 2025 తేదీలలో జరిగిన 7వ నేషనల్ మాస్టర్స్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.సత్యనారాయణ 50 మీటర్స్ బటర్‌ఫ్లై విభాగంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించారు. అంతేకాకుండా, కానిస్టేబుల్ డి. అనిల్ కుమార్ కేవలం ఒక విభాగంలోనే కాక, 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్స్ ఫ్రీ స్టైల్, మరియు 50 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ వంటి మూడు వేర్వేరు స్విమ్మింగ్ విభాగాలలో తృతీయ స్థానాన్ని దక్కించుకొని మూడు బ్రోంజ్ మెడల్స్‌ను గెలుచుకున్నారు. ఇలా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే క్రీడలలో జాతీయస్థాయిలో మొత్తం నాలుగు పతకాలు సాధించిన వీరి అద్భుతమైన కృషిని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, ప్రత్యేకంగా అభినందించారు. వీరు సాధించిన ఈ గొప్ప విజయం తోటి పోలీసు సిబ్బందికి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

# ఎ.సి.బి.కి చిక్కిన గ్రామ రెవిన్యూ అధికారి


దేవరపల్లి, నవంబరు,11(శ్రీ చక్ర): దేవరపల్లి మండలం, పెదనందిపల్లి గ్రామానికి చెందిన యస్. అమ్మతల్లినాయుడు బావకు చెందిన వ్యవసాయ భూమిని రెవిన్యూ రికార్డులలో మ్యుటేషన్ చేసి, ఈ-పాస్ బుక్ ఇచ్చినందుకు గాను అనకాపల్లి జిల్లా, దేవరపల్లి మండలం, యం. అలమంద గ్రామ సచివాలయంలో గ్రామ రెవిన్యూ అధికారిగా పనిచేయుచున్న చుక్క సూర్యనారాయణ సదరు యెస్. అమ్మతల్లి నాయుడు వద్దనుండి రూ. 20,000/-లంచంగా డిమాండు చేసినారు. అయితే సదరు యస్. అమ్మతల్లి నాయుడుకు ఆ లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టంలేక, సదరు గ్రామ రెవిన్యూ అధికారిపై విశాఖపట్నం ఎ.సి.బి అధికారులకు ఫిర్యాదు చేసినాడు. విశాఖపట్నం ఎ.సి.బి అధికారులు, అతని ఫిర్యాదును వారి ఆఫీసు క్రైం. నెం. 9/ఆర్ సీఐ టీ -వీడియో ఎస్ పి /2025, అవినీతి నిరోధక (సవరణ) చట్టం- 2018 సెక్షన్ 7 క్రింద కేసుగా నమోదు చేసి, సదరు గ్రామ రెవిన్యూ అధికారి, ఆ లంచం డబ్బులను, ఫిర్యాదు దారుడి వద్దనుండి ఈ రోజు అనగా తేది.



11.11.2025 నాడు తీసుకొంటుండగా, రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని, అరెస్టు చేసినారు.అరెస్టు కాబడిన సదరు అధికారిని విశాఖపట్నంలోని ఎ.సి.బి. ప్రత్యేక న్యాయస్థానంలో రేపు హాజరు పరచనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో ఏదైనా అవినీతి జరుగుచున్నట్లయితే, సదరు సమాచారాన్ని ఎవరైనా సంభందిత జిల్లా ఎ.సి.బి అధికారులకు కాని లేదా ఎ.సి.బి. టోల్ ఫ్రీ నెంబరు 1064 లేదా ఎ.సి.బి మొబైల్ నెం. 94404 40057 .ఇ నీఎజూశ్రీజీతినిబిబ -జీఇఎఏజీజూ.ణనీల.తిని తెలియపరచవచ్చు.


# ధాన్యం కనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు





జీలుగుమిల్లి నవంబర్ 11 ( శ్రీ చక్ర) ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానికంగా ఏర్పాటుచేసినజీలుగుమిల్లి సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు శ్రీ చిర్రి బాలరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ? రైతులు కష్టపడి ఉత్పత్తి చేసిన ధాన్యానికి సరైన మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం పోలవరం నియోజకవర్గం అంతటా మొత్తం 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ధాన్యం కనుగొనుకు 18 లక్షల గోను సంచులు అందుబాటులో ఉన్నాయని క్వింటా కు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 17 వందల 91 రూపాయలు గా నిర్ణయించడం జరిగిందని. ప్రతి కేంద్రంలో సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, సొసైటీ చైర్మన్ సరిపెల్లి సత్యనారాయణ రాజు, పర్సన్స్ వెలగల అజయ్ కుమార్, సర్పంచ్ సిర్రి జగదాంబ, ఎంపీపీ పోశమ్మ, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, బీజేపీ జిల్లా నాయకులు చాత్రాతి ప్రసాద్, నాయకులుపేరాబత్తులుధనంజయ్,వ్యవసాయశాఖఏడి బుచ్చి బాబు, ఏవోలు గంగాధరం, ఏఈఓ బాలాజీ, సొసైటీ అధికారులు పసల జయంత్, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖపట్నంలో పార్టనర్‌షిప్ సమ్మిట్ భద్రతపై హోం మంత్రి సమీక్ష



నక్కపల్లి, నవంబర్ 11(శ్రీ చక్ర):ఈ నెల(నవంబరు )14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై హోం మంత్రి వంగలపూడి అనిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను అత్యంత పటిష్ఠంగా చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు.విశాఖ నగరం మొత్తం డ్రోన్‌లు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం ఉండాలని, ఫైర్ సేఫ్టీ, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే సమ్మిట్ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ పై ముందుగానే ప్రజలకు సమాచారం అందించే ఏర్పాట్లు చేయాలని, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

# విద్యా వేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి

మార్కాపురం. నవంబర్ 11 శ్రీ చక్రమార్కాపురం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు మంగళవారం ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ ప్రసంగిస్తూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి అన్నారు. అలాగే దేశ తొలి విద్యా శాఖ మంత్రి గా విద్యా రంగంలో అనేక సంస్కరణలు చేపట్టిన గొప్ప విద్యావేత్త అని ఆయన సేవలను కొనియాడారు. ఆ మహనీయుని ఆదర్శాల కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి చైర్మన్ అలిభేగ్ మరియు కళాశాల డైరెక్టర్ మీర్జా మహమ్మద్ మసూద్ అలీబెగ్,ప్రిన్సిపాల్ డాక్టర్ సి హెచ్ శ్రీధర్ లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బి. ఈడి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కె మహమ్మద్ రఫీ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్త ఉద్భవించాలి



వరదయ్యపాలెం,నవంబరు11(శ్రీచక్ర): చిన్నపాండూరు ఏపీ ఐఐసీ పారిశ్రామిక ప్రాంతం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఎం ఎస్ ఎం ఈ(సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు) కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం పాల్గొని ఒక యూనిట్‌కి భూమిపూజ నిర్వహించారు.భూమి పూజ కార్యక్రమంకు వచ్చిన ఎమ్మెల్యే కు ఏపీ ఐఐసీ అధికారులు, వేద మంత్రోచ్ఛారణ నడుమ ఘనంగా స్వాగతం పలికారు.ప్రాంగణం లో ఉన్న నాయకులు ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి అద్భుతమైన ప్రసంగం ను ఏపీ ఐఐసీ అధికారులు ఏర్పాటు చేసిన తెర ( స్క్రీన్) ద్వారా ప్రత్యక్ష ప్రసారం ను పాల్గొన్న వారందరు వీక్షించారు.కార్యక్రమం కు హాజరైనస్థానిక సర్పంచ్,ఎంపీటీసీ ని ఏపీ ఐఐసీ అధికారులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ?"ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగడం, గ్రామ స్థాయిలోనే పరిశ్రమల వృద్ధిని ప్రోత్సహించడం, యువతలో స్వయం ఉపాధి ఆవశ్యకతను నింపడం-ఇదే ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారి విజయ భరత్ రెడ్డి,డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ సుధీర్ రెడ్డి,ఎంపీడీఓ విజయమ్మ, స్థానిక సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ సభ్యులు సామర్ల భువనేశ్వరి,డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు,ఏపీఐఐసి అధికారులు,అపోలో పరిశ్రమ అధికారి సాయిబాబా,ప్రజా ప్రతినిధులు,పోలీస్ అధికారులు, రెవిన్యూ అధికారులు,పరిశ్రమల ప్రతినిధులు,మీడియా మిత్రులు, నాయకులు,అభిమానులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### వాకాడు తాలూకా అధ్యక్షులు తిరుమూరు కృష్ణయ్య ఆధ్వర్యంలో...,

## ఏ పి ఎన్ జి జి ఓ ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ...,



కోట నవంబర్ 11(శ్రీ చక్ర): తిరుపతి జిల్లా ఏ పి ఎన్ జి జి ఓ ఎస్ అసోసియేషన్ నాయకులు, వాకాడు తాలూకా నాయకులు కలసి కోట లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆయా నాయకులు కోట తహసీల్దార్ కే. జయజయ రావు,ఎంపీడీఓ దిలీప్ కుమార్ నాయక్,వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ లను కలిశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నాయకులు, వాకాడు తాలూకా నాయకులు చైర్మన్ ఎస్.సురేష్ బాబు,జిల్లా కన్వీనర్ సీ.రఘు,డి.ఫణి కుమార్, ఎమ్.శ్రీనివాసులు,టి.గురుకుమార్, వాకాడు తాలూకా అధ్యక్షులు తిరుమూరు.కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన శ్రీ ప్రగతి విద్యాసంస్థల విద్యార్థులు



కోట నవంబర్ 11 (శ్రీ చక్ర): ఈ నెల 7, 8, 9 వ తేదీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో విలువిద్య క్రీడా పోటీలలో అండర్ 14 రికర్వ్ క్రీడా విభాగంలో శ్రీ ప్రగతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 9వ తరగతి విద్యార్థిని నిశ్విత సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈమె ఈ నెల 18 నుండి 21 వరకు వారణాసి లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అదేవిధంగా అండర్ 17 రికర్వ్ క్రీడా విభాగంలో శ్రీ ప్రగతి జూనియర్ కాలేజ్ విద్యార్థి చరణ్ కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.చరణ్ జనవరి 5 నుంచి 10 వరకు ఝార్ఖండ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణమని తెలియజేశారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను,కోచ్ శివశంకర్ ను ప్రత్యేకంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.

## మంత్రాలయంలో బాంబు డాగ్ స్క్వాడ్ తనిఖీలు



మంత్రాలయం , నవంబర్ 11,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం లో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మంగళవారం బాంబు , డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేశారు. రాష్ట్ర దేశ రాజధాని ఢిల్లీలో కారు బాంబు పేలుడు సందర్భంగా మంత్రాలయం ఆర్టీసీ బస్టాండ్ రాఘవేంద్ర స్వామి మఠం పరిసర ప్రాంతాలలో పోలీసులు బాంబు , డాగ్ స్క్వాడ్ లు తనిఖీ లు చేపట్టారు. ఎవరైనా అనుమానితులు కనపడితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. అలాగే మండల పరిధిలోని తుంగభద్ర రైల్వే స్టేషన్ లోని బాంబు డాగ్ స్క్వాడ్ లు తనిఖీలు చేశారు.

## మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ గజయంతి వేడుకలు



మార్కాపురం నవంబర్ 11 శ్రీ చక్ర మార్కాపురం మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లి ఆదేశాల మేరకు ఓఊఖా మార్కాపురం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత గొర్లగడ్డ అంగన్వాడి పాఠశాలలో చిన్నారులకు స్వీట్లు పంచి మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి జన్మదిన వేడుకలను ఓఊఖా కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు మరియు టిడిపి టౌన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ మొగల్ జాబీర్ హుస్సేన్ బేగ్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమరయోధులు, ప్రముఖ విద్యావేత్త మరియు భారత మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి అని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారి జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నవంబర్ 11 న జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీల సంక్షేమదినోత్సవంగాజరుపుకోవడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మార్కాపురం అధ్యక్షులు మరియు టిడిపి మార్కాపురం టౌన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మొగల్ జాబీర్ హుస్సేన్బేగ్,గౌరవాధ్యక్షులు షేక్ తాజ్ హుస్సేన్, టిడిపి మైనారిటీ నాయకుడు మొగల్ షాకీర్, ఉపాధ్యక్షులు షేక్ కబీర్, సెక్రటరీ షేక్ సిలార్ ,కమిటీ అడ్వైజర్ సయ్యద్ షాదా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు షేక్ తౌఫిక్, మొగల్ జాకీర్, బీసీ సెల్ సభ్యులు అలీ తదితరులు పాల్గొని మౌలానా అబుల్ కలాం గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## భోపాల్ మేయర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహబూబ్ వలి



మార్కాపురం నవంబర్ 11 శ్రీ చక్రమార్కాపురం మధ్యప్రదేశ్ గౌరవ పురస్కారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షేక్ మహబూబ్ వలి.ఈ అవార్డును మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో ప్రధానం చేశారు డాక్టర్ షేక్ మహబూబ్ వలి కి భోపాల్ మేయర్ కిషన్ సూర్య వంశీ మరియు మధ్యప్రదేశ్ క్యాబినెట్ మంత్రి ప్రతిమ భాగెల్ అవార్డును ప్రధానం చేశారు. డాక్టర్ షేక్ మహబూబ్ వలి గని సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సమస్త జాతీయ అధ్యక్షులు సంజయ్ కుమార్ యాదవ్ గారు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ అధికారిక పత్రాన్ని మరియు ఐడి కార్డ్ అందజేశారు. సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ మీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్ సమస్త బాగా అభివృద్ధి చెందుతుంది అని నేను ఆశిస్తున్నాను నీకు పేరు కోవడం జరిగినది.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి. కార్యక్రమం



మార్కాపురం,నవంబర్ 11: శ్రీ చక్రమార్కాపురం స్వతంత్ర భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి భారతరత్న స్వర్గీయ డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి ని పురస్కరించుకొని శతవసంతాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మార్కాపురం నందు ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు..ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మౌలానా ఆజాద్ భరతజాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ,భారతీయులను ఏకం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సైమన్ మౌలానా ఆజాద్ గారి సేవలు వెలకట్టలేనివి విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. ఆజాద్ జీవితం ఆదర్శనీయమైనదని కొనియాడారు..పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు సయ్యద్ సమీఉల్లా బాష మాట్లాడుతూ మౌలానా ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి,పాత్రికేయుడు, కవి,రచయిత,గొప్ప దేశభక్తుడు,గొప్ప సంఘసంస్కర్త ,స్వాతంత్ర సమరయోధుడు అని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు...

### కోట ఎంపిడిఓ దిలీప్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో...,

## స్వామిత్వ ఇంటి నివేశ స్థలాలు పై సర్వే...,



కోట నవంబర్ 11 (శ్రీ చక్ర) సిద్దవరం గ్రామ సచివాలయంలో ఇళ్లకూరుపాడు గ్రామానికి సంబంధించిన స్వామిత్వ గ్రామసభ సర్పంచ్ సుజాత వారి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 35 మంది గ్రామస్తులు గ్రామకంఠంలో ఉన్న వారి ఇంటి యొక్క కొలతలను సరిచూసుకొని ఆమోదించడం జరిగినది స్వామిత్వా కార్యక్రమంలో భాగంగా వారికి యాజమాన్య హక్కు పత్రము త్వరలో ప్రభుత్వం వారిచే ఇవ్వబడుతుందని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.అనంతరం సిద్దవరం పాఠశాల యందు మధ్యాహ్న భోజన పథకం తనిఖీ,కొత్తపట్నం సచివాలయం సందర్శించి సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ సర్వేలు గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు కార్యక్రమాల పై సూచనలు జారీ చేయడం జరిగింది.

## రైతులకు యూరియా అందజేత



కోట నవంబర్ 11 (శ్రీ చక్ర ): కోట మండలం చెందోడు పంచాయతీ రైతు సేవ కేంద్రం నందు ఎమ్మెల్యే సూచనల మేరకు ఏ ఎమ్ సీ చైర్మన్ మర్రి.ప్రమీల చేతుల మీదుగా రైతులకు యూరియా పంపిణీ చేయడం జరిగింది.అనంతరం ప్రమీల మాట్లాడుతూ రైతులందరూ ఎకరాకు మూడు బస్తాల కంటే యూరియా మించకుండా వాడడం వలన రైతులు సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చునని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు వేణుంబాక. మాధవ కృష్ణా రెడ్డి,తిరుపతి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి వాకా.విజయ భాస్కర్ రెడ్డి,టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు బందెల.రఘురామ్,గ్రామ కమిటీ అధ్యక్షులుపుచలపల్లి.సుధాకర్ రెడ్డి,మాజీ ఎంపిటిసిబోదనపు.బాల సుబ్రహ్మణ్యం,కోట ఎంపీటీసీ దారా.సురేష్,మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్,వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్,పంచాయతీ సెక్రటరీకిరణ్ కుమార్, వి ఏ ఏ మానసవీణ ,సచివాలయం సిబ్బంది,రైతులు పాల్గొన్నారు

## కోటి సంతకాల కార్యక్రమంలో బూచేపల్లి, అన్నాజంకె. అందించే స్ఫూర్తె మాకు నిదర్శనం

### వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి..సయ్యద్ గౌస్ మోహిద్దీన్.




మార్కాపురం. నవంబర్ 11 శ్రీ చక్రమార్కాపురంప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు,దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గారికి, గిద్దలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మార్కాపూరం నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబుల గారికి, మరియు మార్కాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి గారి స్ఫూర్తే మాకు నిదర్శనమని వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మంగళవారం నాడు ఒక ప్రకటనలోతెలిపారు.ఈసందర్భంగా వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలుఎదురైనాఅకుంఠితమైన దీక్షతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి,అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సైన్యాధ్యక్షులుగా వారి ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి విధానానికి నిరసనలో నియోజకవర్గంలో కోటి సంతకాల కార్యక్రమంలో అన్న రాంబాబుకు గారికి ఎడమ కాలి మోకాళ్ళ నొప్పి ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా ప్రజా సమస్య కొరకు వారి పోరాట పటిమతో నిరంతరం కోటి సంతకాల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం మాకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ నూతన ఉత్తేజంతో పేదలు, బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ తెలిపారు.




# డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్ గెలవాలి: మహమ్మద్ సిరాజ్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో ఫైనల్ చేరాలంటే సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో విజయం సాధించాలని టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ అన్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన సౌతాఫ్రికాను ఓడిస్తే డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రస్థానంలో నిలువవచ్చని అభిప్రాయపడ్డాడు.ఈ సైకిల్‌ను టీమిండియా డ్రాతో ప్రారంభించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా 61.5 విన్నింగ్ పర్సంటేజ్‌తో మూడో స్థానంలో కొనసాగుతుంది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్-2లో కొనసాగుతున్నాయి.గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా



తృటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. అగ్రస్థానంలో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఫైనల్ చేరాయి. సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ప్రారంభం కానుంది. కోల్‌కతా వేదికగా తొలి మ్యాచ్ జరగనుండగా.. ఇరు జట్లు ముమ్మరంగా సాధన చేస్తున్నాయి. ఈ సిరీస్‌కు ముందు పాకిస్థాన్‌లో పర్యటించిన సౌతాఫ్రికా రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసుకుంది.సౌతాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన సిరాజ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్ ఈ నయా డబ్ల్యూటీసీ సైకిల్‌కు చాలా కీలకం. ప్రత్యేకించి సౌతాఫ్రికా డిఫెండింగ్ ఛాంపియన్ కాబట్టి ఆ జట్టును ఓడిస్తే ఫైనల్ చేరే అవకాశాలు మెరుగవుతాయి. ఆ జట్టు పాకిస్థాన్‌తో 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. మా ఫామ్‌పై మాకు నమ్మకం ఉంది. మేం సానుకూల వాతవరణాన్ని సృష్టించాం. ఇంగ్లండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేశాం. వెస్టిండీస్‌పై సిరీజ్ గెలిచాం.వ్యక్తిగతంగా నేను మంచి లయతో బౌలింగ్ చేస్తున్నాను. దానిని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నాను. బలమైన జట్టుతో ఆడుతున్నప్పుడు మెరుగుపర్చుకోవాల్సిన అంశాలు ఏంటో తెలుస్తాయి. ఈ సిరీస్‌లో ఎదురయ్యే సవాళ్ల కోసం నేను ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను.'అని సిరాజ్ చెప్పుకొచ్చాడు. ఈ సైకిల్‌లో మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ సైకిల్‌లో సిరాజ్ 7 మ్యాచ్‌లు ఆడి 26.54 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు.

# ముంబై ఇండియన్స్ రిటైన్, రిలీజ్ చేసుకునే ఆటగాళ్ల జాబితా ఇదే!

ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఆట పరంగా మిశ్రమ ఫలితాలను అందుకున్నప్పటికీ విజేతగా నిలవలేకపోయింది. అసాధారణ ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకున్న ముంబై ఇండియన్స్.. క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వరుస ఓటములతో టోర్నీని ప్రారంభించిన ముంబై ఇండియన్స్.. జస్‌ప్రీత్ బుమ్రా రాకతో విజయాల బాట పట్టింది. వరుసగా 6 విజయాలు నమోదు చేసి ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకుంది.ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. కానీ కీలక మ్యాచ్‌లో తడబడింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై ఓటమిని శాసించింది. ఫైనల్ చేరకున్నా ముంబై ఇండియన్స్ జట్టు బలంగానే ఉంది. కానీ ఐపీఎల్ 2026 సీజన్ కోసం



ముంబై ఇండియన్స్ వ్యూహాత్మక మార్పులు చేయనుంది. జట్టు లోపాలను సరిదిద్దుకునేందుకు కొంతమంది ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది. వారి స్థానాల్లో ప్రత్యామ్నాయ ఆటగాళ్లను ఎంచుకోనుంది.ఐపీఎల్ 2025 సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చిన దీపక్ చాహర్, సత్యనారయణ రాజు, ముజీబ్ ఉర్ రెహ్మాన్, రీస్ టోప్లీ, రాబిన్ మింజ్, కర్ణ్ శర్మలను రిలీజ్ చేయనుంది. తెలుగు ప్లేయర్ సత్యనారయణ రాజు 2 మ్యాచ్‌లు ఆడి 13.25 ఎకానమితో ఒకే ఒక్క వికెట్ తీసాడు. రూ. 9.25 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన దీపక్ చాహర్ 14 మ్యాచ్‌లు ఆడి 11 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. గాయాలతో సతమతమయ్యాడు. అఫ్గాన్ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్ కు రిప్లేస్‌మెంట్‌గా జట్టులోకి వచ్చిన ముజీబ్ ఉర్ రెహ్మాన్‌ను కూడా ముంబై వదిలేయనుంది. అతను ఒకే ఒక్క మ్యాచ్ ఆడి తీవ్రంగా నిరాశపర్చాడు.హార్దిక్ పాండ్యా(రూ. 18 కోట్లు), రోహిత్ శర్మ(రూ.16.30 కోట్లు), జస్‌ప్రీత్ బుమ్రా(రూ. 18 కోట్లు), సూర్యకుమార్ యాదవ్(రూ. 16.35 కోట్లు), తిలక్ వర్మ(రూ. 8 కోట్లు), నమన్ ధీర్(రూ. 5.25 కోట్లు), ట్రెంట్ బౌల్ట్(రూ. 12.50 కోట్లు), ర్యాన్ రికెల్టన్(రూ. కోటి), దీపక్ చాహర్(రూ. 9.25 కోట్లు), విల్ జాక్స్(రూ. 5.25 కోట్లు), అశ్వని కుమార్(రూ. 30 లక్షలు), మిచెల్ సాంట్నర్(రూ. 2 కోట్లు), క్రిష్ణన్ శ్రిజిత్(రూ. 30 లక్షలు), రాజ్ బవా(రూ. 30 లక్షలు), సత్యనారాయణ రాజు(రూ. 30 లక్షలు), అర్జున్ టెండూల్కర్(రూ. 30 లక్షలు), లిజాడ్ విలియమ్స్(రూ. 75 లక్షలు), విగ్నేష్ పుతుర్(రూ. 30 లక్షలు).

# బ్యాటింగ్ ఆర్డర్ అంత ముఖ్యం కాదు.. కోచ్‌లు అప్‌డేట్ కావాలి: గౌతమ్ గంభీర్

ఓపెనర్లు మినహా బ్యాటింగ్ ఆర్డర్‌కు అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. టీ20ల్లో ఎన్ని పరుగులు చేశామనేది ముఖ్యం కాదని, ఎంత ప్రభావం చూపించామనేదే కీలకమని చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయం నేపథ్యంలో గంభీర్.. బీసీసీఐ టీవీతో మాట్లాడాడు. ప్రపంచకప్‌కు మూడు నెలల సమయం మాత్రమే ఉందని ఆటగాళ్లంతా సిద్దంగా ఉండాలని సూచించాడు. కాలంతో పాటు టీ20 క్రికెట్ కూడా మారుతుందని, కోచ్‌లు కూడా అప్‌డేట్ కావాలని అభిప్రాయపడ్డాడు.'శ్రీలంకలో నేను హెడ్ కోచ్‌గా బాధ్యతల చేపట్టిన తొలి రోజు నుంచి ఇప్పటి వరకు ఒకే ఐడియాలజీతో ఉన్నాను.




ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు. ఓపెనర్లను మినహాయిస్తే.. బ్యాటింగ్ ఆర్డర్‌కు అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. ఓపెనర్లు మినహా మిగతా బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు ఉంటాయి. ఎందుకంటే టీ20 క్రికెట్‌లో పరుగులు ఎన్ని చేశామనేది ముఖ్యం కాదు. ఎంత ప్రభావం చూపించామనేదే కీలకం.జనాలు కొన్నిసార్లు పరుగులు, ప్రభావాన్ని వేర్వేరుగా చూడలేరు. తప్పుగా లెక్కిస్తారు. టీ20ల్లో ఫలితం మనం చూపించే ప్రభావంపైనే ఆధారపడి ఉంటుంది. 120 బంతుల గేమ్‌లో ప్రతీ బంతిపై అత్యంత ప్రభావాన్ని చూపించాలి. అందుకే మేం తొలి రోజు నుంచే అందుకు తగిన బ్యాటింగ్ ఆర్డర్‌ను ఎంచుకున్నాం. ఈ ఆటను కూడా మేం అదే విధంగా ఆడాలనుకుంటున్నాం.టీ20ల్లో మేం సగటు, స్ట్రైక్రేట్‌ల గురించి ఆలోచిస్తూ ఆడాలనుకోవడం లేదు. ఏ పరిస్థితిలో ఏ ఆటగాడు ఎంత ప్రభావం చూపగలడనే దాని గురించే మేం ఆలోచిస్తున్నాం. ఇది ఈ జట్టుకు చాలా ముఖ్యమైనది. నా అభిప్రాయం ప్రకారం కాలంతో పాటు టీ20 క్రికెట్ మారుతుంది. కోచ్‌లు మారకపోతే ఆటలో వెనుకబడిపోతాం. టీ20 క్రికెట్‌లో మేం కాలానికి ముందే ఉండాలనుకుంటున్నాం. మా కుర్రాళ్లు ఈ ఆలోచనకు బాగా అలవాటు పడ్డారు. వారు ఈ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు.భారత జట్టులో అద్భుతమైన ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఈ రకమైన స్పిన్ ఆల్‌రౌండర్ల లగ్జరీ ఏ జట్లకు ఉంది. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు కొన్నిసార్లు పేస్ ఆల్‌రౌండర్ల లగ్జరీ మనకు దొరకదు. కానీ విదేశీ జట్లు మన దేశానికి వచ్చినప్పుడు అక్షర్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు కీలకంగా మారుతారు. వారు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగలరు. కేవలం బ్యాటర్‌గా కూడా జట్టులో కొనసాగగలరు. ఇది జట్టుకు కలిసొచ్చే అంశం. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్‌లో ఈ ఇద్దరూ చాలా కీలకమవుతారు. వారికి ఉన్న నైపుణ్యాలతో ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించగలరు.ఈ కారణంతోనే వాషింగ్టన్ సుందర్‌కు గత 7-8 నెలలుగా జట్టులో అవకాశం ఇవ్వడం జరిగింది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదో స్థానంలో అక్షర్ పటేల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. బౌలింగ్‌లోనూ రాణించగలడు. పవర్ ప్లే, మిడిల్ ఓవర్లలో కూడా బౌలింగ్ చేస్తాడు. బౌలింగ్ ఆప్షన్స్ ఎక్కువగా ఉండటం ఎప్పుడూ మంచిదే. గతంలో చాలా సార్లు ఆరో బౌలింగ్ ఆప్షన్ గురించి ఎక్కువ చర్చ జరిగేది. కానీ ఇప్పుడు మాకు 7-8 బౌలింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇలాంటి ప్లేయర్లు ఉండటం జట్టుకు మంచిది. వారి సంఖ్య పెరుగుతూ ఉంటే భారత క్రికెట్‌కు తిరుగుండదు.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

# సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వెళ్తే.. ఈ ఇద్దరిలో ఒకరికి రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్సీ..!



ఐపీఎల్ వేలానికి ముందు ఆటగాళ్ల బదిలీ విషయంలో చర్చలు జరుపుతున్నాయి. రాజస్థాన్ కెప్టెన్ సంజు శాంసన్‌ను తీసుకోవాలని చెన్నై జట్టు భావిస్తున్నది. ఈ విషయంలో రెండు ఫ్రాంచైజీల మధ్య చర్చలు మొదలయ్యాయి. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. రెండుజట్ల తొలుత ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఒప్పందం గురించి తెలియజేయాల్సి ఉంటుంది. ముగ్గురు ఆటగాళ్ల పేర్లను అందిస్తాయి. గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదిస్తేనే ఒప్పందం ఖరారవుతుంది. మీడియా నివేదికల ప్రకారం.. సంజు శాంసన్ సీఎస్కే జట్టులోకి వెళ్తే ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్‌లో ఎవరో ఒకరు రాజస్థాన్ కెప్టెన్‌గా ఎంపికయ్యే అవకాశం ఉంది.ఇటీవల ఇద్దరు అసాధారణంగా రాణించారు. శాంసన్స్ 2013లో రాజస్థాన్ రాయల్స్‌లో చేరాడు. అప్పటి నుంచి ఆ ఫ్రాంచైజీలో కీలక ఆటగాడిగా ఉన్నాడు. 19 సంవత్సరాల వయస్సులో జట్టులో చేరిన శాంసన్స్ 2014 సీజన్‌కు ముందు నిలుపుకుంది. 2016-17లో జట్టుపై సస్పెన్షన్ వేటు తర్వాత.. 2018లో తిరిగి వచ్చి 2021లో కెప్టెన్ అయ్యాడు. శాంసన్స్ కెప్టెన్సీలో రాజస్థాన్ 2022 ఐపీఎల్ ఫైనల్ ఆడింది. సంజు 67 మ్యాచులు రాజస్థాన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 33 మ్యాచుల్లో గెలిచి.. 33 మ్యాచులు ఓడిపోయాడు. 2024 ఐపీఎల్ సీజన్‌లో అత్యంత విజయవైన సీజన్ ఇదే. 48.27 సగటుతో 531 పరుగులు చేశాడు. 153.47 స్ట్రయిక్ రేట్‌తో రాణించాడు. 2025 సీజన్‌లో రూ.18కోట్లకు రాజస్థాన్ శాంసన్స్‌ను రీటైన్ చేసుకుంది. కానీ, గాయం కారణంగా సీజన్ మధ్యలో నిష్క్రమించాల్సి వచ్చింది. రాజస్థాన్ జట్టు సైతం తొమ్మిదో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ జట్టు తరపున ఇప్పటివరకు రాజస్థాన్ తరపున అనేక రికార్డులు నెలకొల్పాడు. 4,027 పరుగులు, 25సార్లు యాభై-ప్లస్ స్కోర్ సాధించడంతో పాటు 149 క్యాచ్‌లు అందుకున్నాడు. గత సీజన్ తర్వాత కొత్త జట్టులోకి మారాలనే కోరికను వ్యక్తం చేశాడు. అయితే, శాంసన్‌ను చెన్నైకి ఇస్తే.. జడేజాను ఇవ్వాలని రాజస్థాన్ కోరినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. సీఎస్కే జట్టుకు జడేజా వెన్నెముకగా నిలిచాడు. 2012 నుంచి జట్టులో భాగమైన జడేజా.. మూడు ఐపీఎల్ టైటిల్స్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 2023 ఫైనల్‌లో గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో 254 మ్యాచ్‌లు ఆడిన జడేజా.. 143 వికెట్లు పడగొట్టాడు. జడ్డు ఐపీఎల్ కెరీర్ 2008లో రాజస్థాన్‌తో ప్రారంభమైంది. ఆ సమయంలో జడేజా వయసు 19 ఏళ్లు. పంజాబ్ కింగ్స్ తరఫున ఆడాడు. 2023లో రూ.18.5కోట్లతో చెన్నై రీటైన్ చేసుకుంది. ఆ సీజన్‌లో ప్రదర్శన సాధారణంగా ఉండగా.. ఈ ఏడాది మళ్లీ తక్కువ ధరకు తీసుకుంది.

# దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్.. సవాల్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమన్న సిరాజ్..!



ఈ నెల 14న నుంచి స్వదేశంలో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్నది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తొలి మ్యాచ్ జరుగనున్నది. డిఫెండింగ్ వరల్డ్ టెస్ట్ చాంపియన్ (చిఅ) దక్షిణాఫ్రికాపై మెరుగైన ప్రదర్శన చేయాలని టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ భావిస్తున్నాడు. సిరాజ్ భారత బౌలింగ్ లైనప్‌కు నాయకత్వం వహించనున్నాడు. టాప్ టెస్ట్ ర్యాంకర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి బౌలింగ్ భారం మోయబోతున్నాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్ అత్యధిక వికెట్లు తీసిన ఈ హైదరాబాద్ బైలర్ స్వదేశంలో జరుగనున్న టెస్ట్ సిరీస్‌లో తనదైన ముద్రవేయాలని భావిస్తున్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు మూడోస్థానంలో ఉంది.ఈ సైకిల్ ప్రారంభంలో స్వదేశంలో జరిగిన టెస్టుల్లో భారత జట్టు వెస్టిండిస్‌ను ఓడించడంతో పాటు ఇంగ్లండ్‌తో జరిగిన ఐదుటెస్టుల 2-2తో సిరీస్‌ను సమం చేసింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా పాకిస్తాన్‌తో జరిగిన 1-1తో డ్రాతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ని సాధించింది. ఈ సిరీస్ చిఅ సైకిల్‌లో కీలకమైంది తెలిపాడు. దక్షిణాఫ్రికా డిఫెండింగ్ చాంపియన్స్ కాబట్టి.. పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. ఆ జట్టుపై రాణిస్తామని సిరాజ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం టీమిండియా మంచి ఫామ్‌లోనే ఉందని తెలిపాడు. ఇంగ్లండ్‌పై రాణించడంతోపాటు వెస్టిండీస్ సిరీస్‌ను గెలిచామని సిరాజ్ జియోస్టార్‌తో చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లోనూ సిరాజ్ అద్భుతంగా రాణించాడు. 23 వికెట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్‌పై సైతం అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. రెండు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని.. సవాల్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిరాజ్ తెలిపాడు.


# శ్రేయాస్ అయ్యర్ ఆక్సిజన్ 50కి పడిపోయింది..

ముంబై : ఇండియన్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడ్డ విషయం తెలిసిందే. డైవింగ్ చేస్తూ క్యాచ్ అందుకోబోయిన అయ్యర్‌కు గాయమైంది. దీంతో అతని స్లీన్ భాగంలో తీవ్ర స్థాయిలో రక్త స్రావం అయ్యింది. సిడ్నీ ఆస్పత్రిలో చికిత్స తర్వాత అతన్ని డిశ్చార్జ్ చేశారు. అతను కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని భావిస్తున్నారు. అయితే దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌కు అతను దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి.అయ్యర్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు చాలా సమయం పడుతుందని ఓ నివేదిక ద్వారా తెలిసింది. ప్రమాదం జరిగిన తర్వాత శ్రేయాస్ తీవ్ర స్థాయిలో ఇబ్బందిపడ్డాడు. ఆ సమయంలో అతని



ఆక్సిజన్ 50కి పడిపోయినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అతను కనీసం పది నిమిషాలు కూడా నిలబడలేకపోయాడని చెప్పారు. అతను పూర్తిగా బ్లాకౌట్‌కు గురయ్యాడని, మళ్లీ సాధారణ స్థాయికి వచ్చేందుకు చాలా సమయం పట్టిందని ఒకరు వెల్లడించారు.ఆస్ట్రేలియా సిరీస్‌లో అయ్యర్ రెండు వన్డేల్లో 72 రన్స్ చేశాడు. అడిలైడ్ వన్డేలో రోహిత్ శర్మతో కలిసి సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. శ్రేయాస్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. మిడిల్ ఆర్డర్‌లో కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్‌కు అతను అండగా ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఏడాది ఆడిన 11 వన్డేల్లో అయ్యర్ 49 సగటుతో 496 రన్స్ చేశాడు.


# ఈ కార్తీకమాసంలో ఇలా చేయకపోతే.. మీకు అన్నీ కష్టాలే.. ఎందుకంటే!



ఇది కార్తీకమాసం. కార్తీక మాసం అంటేనే పూజల మాసం. శివుడు, విష్ణువుకు ఈ నెల అంటే ఎంతో ఇష్టం. అందుకే ఈ నెలలో భక్తి శ్రద్ధలతో వారిద్దరికీ భక్తులు పూజలు చేస్తూ ఉంటారు. ఈ పూజలో తులసి పూజకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. తులసి కోటను పూజించి కొన్ని నివారణ కార్యక్రమాలు చేస్తే సిరి సంపదలు, ఆయుష్ ఆరోగ్యాలు ప్రాప్తిస్తాయని నమ్మకం. అయితే చాలా మందికి తులసి కోటను ఎలా పూజించాలి, ఏ విధమైన నివారణ చర్యలు చేయాలి అనేది తెలియదు. అందుకే ఎలాంటి పూజలు చేస్తే అదృష్టం కలుగుతుంది, ఎలాంటి నివారణ చర్యలు చేపట్టాలి అనేది ఇప్పుడు తెలుసుకుందాం. తులసికి చేయాల్సిన నివారణలు "తిరోగమనంలో శని.. నవంబర్ 15 నుంచి ఈ రాశుల వారికి ఏం జరగనుందంటే..?" • కార్తీక మాసంలో తులసి పూజ అనేది చాలా ప్రత్యేకం. అందుకే ప్రతీరోజు తులసి మొక్కకు నీరు పోయాలి. అలాగే రోజూ సాయంత్రం నెయ్యితో దీపం వెలిగించాలి. ఇలా చేయడం వల్ల మొక్క ఆరోగ్యంగా ఉండడంతో పాటు.. లక్ష్మీ దేవి మీ పూజకు సంతోషించి మీ ఇంట్లో సుఖసంతోషాలు కలిగిస్తుందని భక్తుల నమ్మకం. • కార్తీక మాసంలో లక్ష్మి దేవికి ప్రతిరోజూ పచ్చిపాలు, గంగాజలం సమర్పించాలి. ఇలా సమర్పించడం వల్ల.. లక్ష్మీ దేవి ప్రసన్నం అవుతుందని, అలాగే అలా సమర్పించే వారికి డబ్బుల కొరత లేకుండా చేస్తుందని పేర్కొంటున్నారు. "ఈ బ్లడ్ గ్రూప్ ఉన్న వారికే గుండెపోటు ఎక్కువగా వస్తుందట.. అవి ఏవేవి అంటే?" • కార్తీక మాసంలో ప్రధానంగా శివుడితో పాటు విష్ణుడిని కూడా పూజిస్తారు. విష్ణువు పూజలో తులసి నైవేద్యం అనేది తప్పనిసరి. ఎందుకంటే విష్ణువుకు తులసి అనేది చాలా ఇష్టమైన నైవేద్యం. అందుకే విష్ణువు పూజలు తులసి నైవేద్యం లేకపోతే ఆ పూజ అసంపూర్ణమైనదని భావిస్తుంటారు. కాబట్టి ఈసారి పూజలో విష్ణువుకు తులసి దళాలను ఉంచండి. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవితో పాటు విష్ణువు అనుగ్రహం కూడా లభిస్తుంది కార్తీకమాసంలో తులసికి పూజలతో పాటు ప్రదిక్షణలు కూడా చేయాలి. తులసి కోటకు పూజ చేసిన తరువాత 7, 11, 21, 51, 108 ప్రదక్షిణలు చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల ఆ ఇంట్లోని కుటుంబ సభ్యులపై లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటుందని నమ్ముతారు. అలాగే ఆ కుటుంబంలో ఆనందం, శ్రేయస్సు నెలకొంటుందని, జీవితంలో మార్పులు వస్తాయని ప్రతీతి • కార్తీకమాసంలో తులసికి చేయాల్సిన నివారణ కార్యక్రమాల్లో తులసి వివాహం కూడా ఒకటి. కాబట్టి ఈ కార్తీక మాసంలో తులసికి వివాహం జరిపించి.. గాజులు, కుంకుమ, పసుపు, కాలి మెట్టెలు, ఇతర వివాహ వస్తువులను సమర్పించాలి. దీంతోపాటు తులసి కోటకు ఎర్రటి చునారీని నైవేద్యంగా సమర్పించాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల మీ వైవాహిక జీవితంలో సుఖ సంతోషాలు నెలకొంటాయని భక్తులు నమ్ముతారు. "పెరుగులో ఇవి కలిపి తింటున్నారా ? చాలా డేంజర్ అంటున్న నిపుణులు" వీటితో పాటు తులసికి చేయాల్సిన కొన్ని పూజలు కూడా క్రమం తప్పకుండా చేస్తే, ఆ లక్ష్మీదేవి అనుగ్రహం మీపై, మీ కుటుంబంపై ఉంటుందని పెద్దలు చెబుతూ ఉంటారు. అందుకే మీ అందరికీ కార్తీకమాసం శుభాకాంక్షలు తెలుపుతూ, ఆ లక్ష్మి దేవి కరుణ, అనుగ్రహం మీపై ఉండాలని ఆ లక్ష్మీమాతను బోల్డ్ స్కై తరుపున వేడుకుంటున్నాం.

# ఈ ఆకులను తెచ్చి మీ ఇంట్లో పెట్టుకోండి.. ఎందుకంటే!

ప్రస్తుత కాలంలో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చాలామంది చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే.. మన ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు జామకాయ దివ్య ఔషధంలా పని చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు, విటమిన్స్ మనల్ని అనేక రోగాల బారిన పడకుండా రక్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కేవలం జామకాయ మాత్రమే కాదు, జామ ఆకులు కూడా అనేక రోగాల నివారిణిగా పని చేస్తాయని ఆయుర్వేద పండితులు చెబుతున్నారు. ఇందులో అనేక రకాల పోషకాలు లభిస్తాయని, ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు సహాయపడతాయని చెబుతున్నారు. రోగాల బారిన కూడా పడకుండా రక్షిస్తాయని పేర్కొంటున్నారు. అయితే జామ ఆకును ఎలా తినాలి, దీంతో ఏ విధమైన లాభాలు ఉన్నాయనేది ఇప్పుడు



తెలుసుకుందాం. "తిరోగమనంలో శని.. నవంబర్ 15 నుంచి ఈ రాశుల వారికి ఏం జరగనుందంటే..?" రక్తంలో షుగర్ నియంత్రిస్తుంది: జామ ఆకులు రక్తంలో షుగర్ లెవెల్స్ ఎక్కువగా అవ్వకుండా నియంత్రిస్తాయి. ఇందులో ఉండే పోషకాలు షుగర్ లెవల్ పెరగకుండా చేయడంతో పాటు.. ఆహారం నుంచి కార్బోహైడ్రేట్ శోషణను నియంత్రించడంలో సహాయపడుతుంది. డయాబెటిక్ రోగులు దీనిని తీసుకుంటే మంచి ఫలితాలు పొందొచ్చు. చర్మం, జుట్టు ఆరోగ్యానికి.."ఆ చేపకు జీవం వస్తే యుగాంతమే.. ఆ చేప ఎక్కడుందో తెలుసా?" జామ ఆకులో జామకాయలో ఉన్నట్లే విటమిన్ సీ, యాంటి ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకులను డికాషన్ చేసుకొని తాగితే, చర్మం, జుట్టు సమస్యలు దూరం అవుతాయి. అందులో ఉండే విటమిన్ సీ రోగ నిరోధక శక్తి పెరగడానికి కూడా సహాయపడతాయి. దీనిని తీసుకోవడం వల్ల జుట్టు బలంగా మారడంతో పాటు చర్మం కాంతివంతంగా తయారవుతుంది. గుండె జబ్బు నివారణలో.. జామ ఆకులను నీటిలో వేసి బాగా వేడి చేసుకున్నాక అందులోని రసాన్ని తాగితే చక్కటి ఫలితాలు పొందొచ్చు. ఈ రసం చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది, అలాగే మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. దీని కారణంగా గుండె జబ్బులు రాకుండా నియంత్రించుకోవచ్చు.


# గుండెపోటు వచ్చే ముందు ఈ అయిదు లక్షణాలు కనిపిస్తాయి.. ఎలా గుర్తుపట్టాలంటే?



ఈమధ్య కాలంలో గుండెపోటు కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిన విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా చెప్పాలంటే కరోనా తరువాత గుండెపోటుతో మరణించే వారి సంఖ్య విపరీతంగా ఎక్కువైపోయింది. ఆడుతూ పాడుతూ గుండెపోటుకు గురై ఎక్కడికక్కడ ప్రాణాలు కోల్పోతున్నారు. వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురై మృతి చెందుతున్నారు. అయితే గుండెపోటు లక్షణాలను ముందుగానే గుర్తిస్తే.. ప్రమాదం నుంచి బయటపడొచ్చని నిపుణులు అంటున్నారు. ఇంతకీ ఆ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..• గుండెపోటు వచ్చే వారం ముందు భుజం, చేతులు తీవ్రంగా నొప్పిస్తాయి. మరీ ముఖ్యంగా ఎడమ భుజంలో ఉన్నపళంగా తీవ్రమైన నొప్పి వస్తుంది. అలాగే ఎడమ చేయి ఫుల్లుగా గుంజడం మొదలవుతుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన చికిత్స తీసుకుంటే మంచిది.• గుండెపోటు వచ్చే వారం ముందు వచ్చే లక్షణాల్లో చాతి నొప్పి ముఖ్యమైనది. గుండెపోటు వచ్చే ముందు ఛాతిలో నొప్పి పుడుతుంది. సాధారణంగా అసిడిటీ, గ్యాస్ వంటి సమస్యలు ఉన్నప్పుడు కూడా ఛాతిలో మంటగా, నొప్పిగా ఉంటుంది. అయితే గుండెపోటు వచ్చే సమయంలో చాతి నొప్పి చాలా తీవ్రంగా ఉంటుందని, దానిని భరించలేమని నిపుణులు చెబుతున్నారు. అలాంటి సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. సాధారణంగా పలువురు వైద్య నిపుణులతో, వైద్యులు సహా గుండెపోటుకు వెన్నునొప్పికి సంబంధం ఉంటుందని చెబుతూ ఉంటారు. అయితే గుండెపోటు వచ్చే వారం రోజుల ముందు.. ఉన్నట్టుండి వెన్నునొప్పి మొదలవుతుందట. ఇలా వెన్నునొప్పి మొదలై బాధ పెడుతుంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని, నిపుణులు సూచిస్తున్నారు.• కొన్ని కొన్ని సందర్భాల్లో చేతులు గుంజడం, భుజాల్లో నొప్పి కలగడం వంటివి ఏర్పడతాయాని మనం చెప్పుకున్న విషయం తెలిసిందే. అయితే మరి కొన్ని సందర్భాల్లో అరచేతితో పాటు చేతిలోనూ భరించలేని నొప్పి ఉంటుందట. ఈ నొప్పి వారం రోజులకంటే ఎక్కువగా ఉంటే గుండెపోటుకు సంకేతమని చెబుతున్నారు. ఇలాంటి లక్షణం కనిపిస్తే వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని తెలుపుతున్నారు.• గుండెపోటుకు వారం ముందు కనిపించే లక్షణాల్లో దవడ నొప్పి కూడా ఒకటి. గుండెపోటు వచ్చేముందు ఉన్నట్టుండి దవడ నొప్పి మొదలవుతుందని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా ఎడమ దవడ తీవ్రంగా నొప్పిస్తుందని, అలా నొప్పి ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.ఏది ఏమైనప్పటికీ.. గుండెపోటు రాకుండా మనమే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. బద్ధకంగా ఒకేచోట ఉండకుండా వ్యాయామం చేయడం, సరైన రీతిలో ఆహారం తీసుకోవడం వంటివి చేయాలి. అలాగే జంక్ ఫుడ్స్, ఆల్కహాల్, సిగరెట్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి మన గుండెను మనమే కాపాడుకోవాలి.

# హార్ట్ అటాక్ లక్షణాలు మొదట ఛాతీ నొప్పితో కాకుండా కళ్లలో ఈ సంకేతాలు కనబడుతాయి..!!

ఒక వ్యక్తికి ఎప్పుడైనా గుండెపోటు రావచ్చు. ఇది ప్రధానంగా పెద్దలకు మాత్రమే కాకుండా పిల్లలకు కూడా సంభవించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది గుండెపోటుతో మరణిస్తున్నారు. ఒక వ్యక్తికి గుండెపోటు రావడానికి కారణం మనం తినే ఆహారంలోని అదనపు కొలెస్ట్రాల్ రక్త నాళాలలో చేరడం వల్ల రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడి గుండెపోటు వస్తుంది. "శృంగారం తరువాత మీ భాగస్వామితో ఇలా చేయాలి.. లేకపోతే..!" పిల్లల్లో గుండెజబ్బులు వచ్చే అవకాశం లేదని చాలా మంది అనుకుంటారు. కానీ అది పూర్తిగా తప్పు. పిల్లలకు గుండెపోటు కూడా రావచ్చు. ఒక వ్యక్తికి సాధారణంగా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటే, కొన్ని లక్షణాలను చూపడం ద్వారా గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని నివారించడం సాధ్యమవుతుంది. చాలా మంది ఛాతీ నొప్పి మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని మాత్రమే గుండెపోటు యొక్క లక్షణంగా గమనిస్తారు. కానీ గుండెపోటు రాబోతున్నట్లయితే, అది కళ్లలో కూడా లక్షణాలను చూపుతుంది. ఇప్పుడు కళ్లలో కనిపించే గుండెపోటు సంకేతాలను చూద్దాం. కంటి రంగులో మార్పు మీరు కంటి రంగులో మార్పులను చూస్తున్నారా? ఇది ఎరుపు లేదా కొద్దిగా పసుపు? అలా అయితే, కళ్లలో రక్త ప్రసరణ తక్కువగా ఉండటం దీనికి కారణం కావచ్చు. కాబట్టి అకస్మాత్తుగా కళ్లలో ఈ రకమైన మార్పు కనిపిస్తే, అది గుండె సమస్యకు సంకేతం కావచ్చు. ఈ సందర్భంలో, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. "ఆ చేపకు జీవం వస్తే యుగాంతమే.. ఆ చేప ఎక్కడుందో తెలుసా?" కళ్లలో వాపు కళ్ల చుట్టూ ఉన్న ప్రాంతం అకస్మాత్తుగా ఉబ్బినట్లు ఉందా? అలా అయితే, గుండెకు సంబంధించిన సమస్య వల్ల కళ్ల చుట్టూ నీరు నిలిచిపోయి, వాపు వచ్చి ఉండవచ్చు. అటువంటి పరిస్థితిలో, వెంటనే వైద్యుడిని సంప్రదించమని సిఫార్సు చేయబడింది. సరిగ్గా చూడలేకపోవడం కారణం లేకుండా అకస్మాత్తుగా ఏ వస్తువును సరిగా చూడలేకపోతున్నారా? ప్రతిదీ అస్పష్టంగా కనిపిస్తుందా? అలాంటప్పుడు గుండె సమస్య వల్ల కళ్లకు రక్తప్రసరణ తగ్గుతుంది, తత్ఫలితంగా చూసే సామర్థ్యం దెబ్బతింటుంది. దీన్ని వెంటనే డాక్టర్‌కు తెలియజేయాలి. వంగిపోతున్న కనురెప్పలు మీ కనురెప్పలు పడిపోయినట్లయితే, అది గుండెపోటుకు ప్రమాదకరమైన సంకేతం కావచ్చు. కనురెప్పల కండరాలకు రక్త ప్రసరణ తగ్గినప్పుడు, ఆ ప్రాంతంలోని కండరాలు బలహీనంగా మారతాయి మరియు పడిపోవడం ప్రారంభమవుతుంది. ఈ పరిస్థితిలో, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించి, సమస్య గురించి అతనికి తెలియజేయాలి మరియు చికిత్స పొందాలి. "పెరుగులో ఇవి కలిపి తింటున్నారా ? చాలా డేంజర్ అంటున్న నిపుణులు" అసాధారణ అసౌకర్యం ఈ రోజుల్లో చాలా మంది కంప్యూటర్ ముందు కూర్చుని ఎక్కువ గంటలు పని చేస్తున్నారు. ఈ కారణంగా, చాలా మంది కంప్యూటర్‌ను ఎక్కువగా ఉపయోగించడం వల్ల తమకు కళ్లలో నొప్పి మరియు అసౌకర్యం ఉందని భావించి దానిని సాధారణ స్థితికి వదిలివేస్తారు. కానీ కళ్లలో ఒత్తిడి ఎక్కువగా ఉండి, కళ్లకు రక్త ప్రసరణ తగ్గితే అది గుండెపోటుకు సంకేతం. మెరుపు మీరు ప్రకాశవంతమైన కాంతిని చూస్తే మీ కళ్ళు కుట్టుతున్నాయా? అలాంటి ప్రకాశవంతమైన కాంతిని చూసేంత సున్నితత్వం కళ్ళు ఉంటే, కళ్లకు రక్త ప్రసరణ తక్కువగా ఉందని అర్థం. కళ్లకు సరిపడా రక్త ప్రసరణ జరగకపోతే గుండెకు సంబంధించిన సమస్య ఉందని అర్థం. ఈ సందర్భంలో, మీరు వెంటనే వైద్యుడిని చూడాలి.




# నెయ్యి తింటున్నారా? అయితే ముందుగా ఇవి తెలుసుకోండి.. లేదంటే..!




నెయ్యి అనేది ఆరోగ్యానికి మంచిదనే విషయం మనందరికీ తెలిసిందే. రోజూ ఒక స్పూన్ నెయ్యి తింటే మన శారీరానికి అవసరమైన, ఆరోగ్యకరమైన పోషకాలు అందుతాయని వైద్యులు, ఆరోగ్య నిపుణులు చెబుతూ ఉంటారు. అయితే మార్కెట్‌లో మనకు ఆవు నెయ్యి, గేదె నెయ్యి రెండూ దొరుకుతాయి. వీటిలో ఏది తింటే ఆరోగ్యానికి మంచిది, ఈ రెండిటికి మధ్య తేడా ఏంటిది అనేది తెలుసుకుందాం. రెండిటి మధ్య తేడా ఏంటంటే? గేదె నెయ్యి ఆవు నెయ్యితో పోలిస్తే కొంచెం తెల్లగా ఉంటుంది. అదే ఆవు నెయ్యి గేదె నెయ్యితో పోలిస్తే కొంచెం పసుపు రంగులో ఉంటుంది. గేదె నెయ్యిలో ఎక్కువ మొత్తంలో క్యాలరీలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిని బరువు పెరగాలనుకునే వారు తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. అలాగే ఎముకలు ఆరోగ్యంగా ఉండాలన్నా గేదె నెయ్యి తినాలని, అందులో ఎముకలను పోషించే పోషకాలు చాలా ఉంటాయంటున్నారు. "త్వరలో రాశి మార్చుకోనున్న సూర్యుడు.. ఈ రాశి వారికి పట్టిందల్లా బంగారమే!" అదే ఆవు నెయ్యి తింటే గుండెకు చాలా మంచిదని, ఇందులో కొవ్వు శాతం తక్కువగా ఉండడంతో పాటు, క్యాలరీలు కూడా తక్కువగా ఉంటాయన్నారు. తద్వారా గుండె సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని, బరువు తగ్గాలనుకునే వారు కూడా ఆవు నెయ్యిని తీసుకోవాలని చెబుతున్నారు. ఆయుర్వేదంలో ఏం చెప్పారంటే? "పచ్చి మాంసం ఫ్రిడ్జ్‌లో పెడుతున్నారా.. అయితే ఈ ఆరోగ్య సమస్యలు రావడం ఖాయం!" ఆయుర్వేదం ప్రకారం ఆరోగ్యానికి ఆవు నెయ్యి మంచిదని తెలుస్తోంది. గేదె నెయ్యితో పోలిస్తే ఆవు నెయ్యిలోనే ఎక్కువ మోతాదులో పోషక విలువలు ఉంటాయి. ఆవు నెయ్యిలో పోషకాలతో పాటు కొన్ని సానుకూల శక్తులు కూడా ఉంటాయని నమ్మకం. వివిధ రకాల వ్యాధులకు నయం చేసే క్రమంలో మెడిసిన్‌గా ఆవు నెయ్యిని కూడా వినియోగిస్తారు. కొన్ని రకాల మూలికల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తారు.ఏది ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది? సాధారణంగా నెయ్యి అనేది చాలా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అయితే ఆవు నెయ్యితో పోలిస్తే గేదె నెయ్యి ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. గేదె నెయ్యి సుమారు రెండేళ్ల పాటు నిల్వ ఉంటే, ఆవు నెయ్యి మాత్రం ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు తాజాగా నిల్వ ఉంటుంది. "ప్రేమకు గుర్తుగా హార్ట్ సింబల్ ఎలా వచ్చిందో తెలుసా? " బరువు తగ్గాలనుకునేవారు ఏది తినాలి: నెయ్యి ఆరోగ్యానికి మంచిది కాబట్టి చాలామంది తింటూ ఉంటారు. అయితే బరువు తగ్గాలనుకునేవారు గేదె నెయ్యి జోలికి పోకపోవడమే మంచిది. ఎందుకంటే ఇందులో కొవ్వు శాతం ఎక్కువగా ఉండడంతో పాటు క్యాలరీలు కూడా అధికంగా ఉంటాయి. దీంతో సులువుగా బరువు పెరుగుతారు. అందుకే బరువు తగ్గాలనుకునేవారు ఆవు నెయ్యిని తీసుకోవాలని సూచిస్తున్నారు. అందులో కొవ్వు శాతం చాలా తక్కువ మోతాదులో ఉంటుందని, క్యాలరీలు కూడా చాలా తక్కువగా ఉంటాయని చెబుతున్నారు. ఇందులో ఉండే లినొలిక్ యాసిడ్ జీవక్రియను మెరుగుపరిచి, ఇన్సులిన్ స్థాయిని తగ్గిస్తుందని, తద్వారా బరువు కూడా తగ్గొచ్చని చెబుతున్నారు. ఏ నెయ్యి తింటే మంచిది? ఆవు నెయ్యి తినడం వల్ల స్థూలకాయం బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు. అలాగే అనేక వ్యాధుల నుండి కూడా ఇది మనల్ని రక్షణ కల్పిస్తుంది. అయితే అథ్లెట్లు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు గేదె నెయ్యిని తీసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వారికి ఎక్కువ శక్తి అందించేందుకు గేదె నెయ్యి దోహపడుతుంది. అలాగే చురుకుగా ఉండేందుకు సహాయపడుతుంది.

# బరువు తగ్గాలనుకునేవారు ఈ దోశ తినాలి.. ఎలా చేసుకోవాలంటే?

ఈ మోడ్రన్ కాలంలో చాలా మంది బరువు తగ్గేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతి ఒక్కరూ డైట్ పాటిస్తూ.. జిమ్ చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి ఇష్టమైన ఆహారాన్ని వదులుకుంటున్నారు. కొందరైతే పొద్దున్న బ్రేక్ ఫాస్ట్ కూడా మానేస్తున్నారు. అయితే బరువు తగ్గాలనుకునేవారు, వారికి ఇష్టమైన బ్రేక్ ఫాస్ట్ మానకుండా, తినే విధంగా ఉండే ఒక టిఫిన్ వంటకాన్ని ఈరోజు మీకు పరిచయం చేస్తాము. అదే.. పనీర్ బీట్‌రూట్ దోశ. ఇది తింటే ఆరోగ్యంతో పాటు బరువు కూడా సులువుగా తగ్గొచ్చు. అయితే ఈ పనీర్ బీట్‌రూట్ దోశను ఎలా చేసుకోవాలి, చేసుకునే విధానం ఏంటి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈరోజు తెలుసుకుందాం. కావాల్సిన పదార్థాలు: ముందుగా ఈ పనీర్ బీట్‌రూట్ దోశ తయారు చేయడానికి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. ంటలవతీబితిబవఎవనిబి • దోశ పిండి • బీట్‌రూట్ • పనీర్, • పనీర్ సగ్గుబియ్యం • ఉల్లిగడ్డ • క్యారట్ • పచ్చి మిర్చి • ఎర్రటి ఉప్పు మిరపకాయలు • నూనె • ధనియాల పొడి తయారీ విధానం: ముందుగా దోశ పిండిని కలుపుకోవాలి. అందులో బీట్‌రూట్ నుంచి వేరు చేసిన రసాన్ని కలుపుకొని.. బాగా కలుపుకోవాలి. అది కూడా బాగా సన్నగా కాకుండా దోశ వేసుకునేందుకు వీలుగా, కొంచెం టైట్‌గా కలుపుకోవాలి. తరువాత ఆ మిశ్రమాన్ని కాసేపు పక్కన పెట్టుకోవాలి. తరువాత స్టవ్ ఆన్ చేసి, పెనం పెట్టి.. అందులో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక అందులో సన్నగా తరిగిన ఉల్లిగడ్డ ముక్కలు వేసుకోవాలి. ఉల్లిగడ్డ ముక్కలు కొంచెం వేగాక.. అందులో పచ్చిమిర్చి, క్యారట్, మెత్తగా చేసుకున్న పనీర్ ముక్కలను వేసుకోవాలి. అవన్నీ కొద్దిసేపు వేగాక.. అందులో ఉప్పు, కారం, ధనియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. పనీర్ ముక్కలతో పాటు ఉల్లిగడ్డ ముక్కలకు కూడా మసాలా బాగా పట్టే విధంగా కలుపుకోవాలి. గ్యాస్ ఆపే ముందు అవన్నీ బాగా కలిశాయ లేదా అనేది నిర్ధారించుకొని ఆఫ్ చేయాలి. ఇప్పుడు.. దోశ పెంక తీసుకొని.. దానిపై కొన్ని చుక్కల నూనె పోసి పెంక మొత్తం బాగా పోసుకోవాలి. ఇప్పుడు మనం ముందుగానే కలిపి పెట్టుకున్న బీట్‌రూట్ దోశ పిండిని పెంకపైన వేసి దోశ వేసుకోవాలి. దోశ ఎప్పుడైతే లేత బంగారు వర్ణంలో మారుతుందో అప్పుడు ఇంకోవైపు తిప్పి దానిపై మనం కలిపి పెట్టుకున్న పనీర్ మిశ్రమాన్ని వేసి, కొంచెం ఆయిల్ పోసి.. కొద్దిసేపు పెనం మీద ఉంచి, కిందకు దించుకోవాలి. అంతే చాలా సులభంగా, ఆరోగ్యకరమైన పనీర్ బీట్‌రూట్ దోశ సిద్ధమైనట్లే.




# ఆ లుక్స్ తోనే గూస్‌బంప్స్ వచ్చాయి



: నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ది ప్యారడైజ్. హిట్3 తర్వాత నాని చేస్తున్న ది ప్యారడైజ్ కు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. దసరా సినిమాతో ఫస్ట్ అటెంప్ట్ తోనే మంచి హిట్ ను ఖాతాలో వేసుకోవడంతో పాటూ ఆ సినిమాతో నాని తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా నిలబెట్టుకున్నారు శ్రీకాంత్. ఆ నమ్మకంతోనే ఇప్పుడు నాని మరోసారి శ్రీకాంత్ కు ఛాన్స్ ఇచ్చారు. ది ప్యారడైజ్ రా స్టేట్‌మెంట్స్ కు భారీ రెస్పాన్స్ దసరా సినిమా తర్వాత నాని- శ్రీకాంత్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా శ్రీకాంత్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని ఆల్రెడీ రిలీజైన గ్లింప్స్ తోనే క్లారిటీ వచ్చింది. ది ప్యారడైజ్ నుంచి రా స్టేట్‌మెంట్ పేరుతో వచ్చిన గ్లింప్స్ కు ఆడియన్స్ నుంచి ఏ స్థాయి రెస్పాన్స్ వచ్చిందో కొత్తగా చెప్పనక్కర్లేదు. డిఫరెంట్ లుక్ లో కనిపించనున్న నాని దసరాతో నానిని మాస్ హీరోగా ప్రెజెంట్ చేసిన శ్రీకాంత్ ఈసారి ది ప్యారడైజ్ ఇంకా కొత్తగా ప్రెజెంట్ చేయనున్నారని లుక్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ది ప్యారడైజ్ మూవీ గురించి దసరా సినిమాలో కీలక పాత్రలో నటించిన దీక్షిత్ శెట్టి రీసెంట్ గా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రీసెంట్ గా ది ప్యారడైజ్ సెట్స్ కు వెళ్లానని దీక్షిత్ చెప్పారు. దసరా కంటే భారీగా.. ది ప్యారడైజ్ కోసం వేసిన సెట్, ఆ సెటప్ నెక్స్ట్ లెవెల్ లో ఉన్నాయని, ది ప్యారడైజ్ తెలుగు సినిమాకు గేమ్ ఛేంజర్ అవుతుందని, షూటింగ్ టైమ్ లో నాని లుక్ చూశాక తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ది ప్యారడైజ్ మూవీ దసరా సినిమా కంటే చాలా భారీగా ఉండబోతుందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ది ప్యారడైజ్ లో మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో కనిపించనుండగా, అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

# రీ రిలీజ్ వసూళ్లు.. ఇండియాలో బాహుబలి ప్లేస్ ఎంతంటే?

: ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత కాలంగా రీ రిలీజ్ ట్రెండ్ నడుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన అనేక సినిమాలు.. మళ్లీ థియేటర్స్ లో సందడి చేస్తున్నాయి.. సందడి చేశాయి కూడా.. వాటిలో చాలా చిత్రాలు.. బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్ లో వసూళ్లను రాబడుతున్నాయి. సినీ ప్రియులను ఫుల్ గా అలరిస్తున్నాయి. అయితే బ్లాక్ బస్టర్ హిట్స్ గా నిలిచి తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన బాహబలి రెండు సినిమాలు.. ఇటీవల ఒక పార్ట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి విదితమే. రెండు భాగాలు కలిపి ఎడిట్ చేసి బాహుబలి ది ఎపిక్ పేరుతో మేకర్స్ రిలీజ్ చేశారు. బహుశా భారతీయ సినీ చరిత్రలో అలా చేయడం ఇదే తొలిసారి. రీ రిలీజ్ కు కూడా ప్రీమియర్స్ వేయగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. భారీ వసూళ్లను సాధించింది బాహుబలి ఎపిక్. థియేటర్స్ కు ఆడియన్స్ ను పెద్ద ఎత్తున రప్పించింది. రూ.10 కోట్లకు పైగా ఓపెనింగ్స్ రాబట్టిన బాహబలి ఎపిక్ వెర్షన్.. ఇప్పటి వరకు రూ.37 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. తద్వారా ఇండియాలో టాప్-3 రీ రిలీజ్ గ్రాసర్ గా నిలిచింది. ఇండియా వైడ్ గా చూసుకుంటే రీ రిలీజ్ ట్రెండ్ లో ఇప్పటివరకు.. సనం తేరీ కసమ్ టాప్ ప్లేస్ లో ఉంది. ప్రేమకథా చిత్రంగా వచ్చిన ఆ సినిమా.. మొదటిసారి విడుదలైనప్పుడు పెద్దగా వసూళ్లు రాబట్టలేకపోయింది. కానీ రీ రిలీజ్‌లో యూత్ నుంచి భారీ రెస్పాన్స్ అందుకుంది. రూ.39.15 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. మరి ఆ లిస్ట్ లో ఏ ఏ సినిమాలు ఉన్నాయంటే.. ఇండియాలో టాప్ రీ రిలీజ్ గ్రాసర్లు సనం




తేరి కసం- రూ.39.15 కోట్లు తుంబాడ్- రూ.37.5 కోట్లు బాహుబలి ది ఎపిక్- రూ.37 కోట్లు ఇంటర్ స్టెల్లార్- రూ.29 కోట్లు గిల్లి- రూ.26.5 కోట్లు యే జవానీ హై దీవానీ- రూ.25.4 కోట్లు టైటానిక్ 3డీ- రూ.18 కోట్లు షోలే 3డీ- రూ.13 కోట్లు లైలా మజ్ను- రూ.11.6 కోట్లు రాక్ స్టార్- రూ.11.5 కోట్లు అవతార్-రూ.10 కోట్లు అయితే ఇప్పటి వరకు పై జాబితాలో సౌత్ నుంచి గిల్లి మూవీ మాత్రమే ఉంది. కానీ రీసెంట్ గా వచ్చిన బాహుబలి ది ఎపిక్ అందులో చేరి సత్తా చాటింది. మూడో స్థానాన్ని సంపాదించుకుని అలరించింది. టాలీవుడ్ లో నుంచి జాబితాలో స్థానం దక్కించుకున్న తొలి మూవీగా కూడా నిలిచింది.

# కొరియన్ డ్రామాల్లో రష్మిక..వాటికి మాత్రం నో!

కన్నడ నుంచి నేషనల్ క్రష్ అయింది రష్మికా మందన్నా. టాలీవుడ్, బాలీవుడ్ లో అమ్మడి సక్సస్ ల గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం రెండు భాషల్ని రష్మిక దున్నేస్తుంది. బాలీవుడ్ లో స్టార్ లీగ్ కి అతి సమీపంలో ఉంది. మరో రెండు బ్లాక్ బస్టర్లు పడ్డాయంటే? స్టార్ లీగ్ లాంఛనమే. అయితే అమ్మడు ఇంత బిజీగా ఉన్నా? కొరియన్ భాషపై సైతం అప్పుడే కన్నేసినట్లు కనిపిస్తుంది. కొరియన్ పై ముందొస్తు ప్రణాళిక తానెప్పుడో సిద్దం చేసి పెట్టుకుందని తాజాగా వెలుగులోకి వచ్చింది. కొరియన్ భాషలో నటించే అవకాశం వస్తే వెళ్లడానికి తాను సిద్దంగా ఉన్నట్లు వెల్లడించింది. కండీషన్లు మాత్రం అప్లై: కె-డ్రామాలంటే తనకు ఎంతో ఆసక్తిగా చెప్పుకొచ్చింది. వాటిలో నటించడం ఓ థ్రిల్లింగ్ గా భావిస్తానంది. లాక్ డౌన్ సమయంలో కొరియన్ సినిమాలు ఎక్కువగా చూసినట్లు తెలిపింది. అక్కడ నటీనటుల పనితనం ఎలా ఉంటుంది? ఎలాంటి కథలు తెరెక్కిస్తున్నారు? అక్కడ పని విధానం ఎలా ఉంటుంది? వంటి విషయాలు తెలుసుకున్నట్లు చెప్పుకొచ్చింది. అయితే కొరియన్ సినిమాలపై తనకెంత ఇష్టం ఉన్నా? కండీషన్లు మాత్రం అప్లై అంటుంది. అన్ని రకాల కథల్లో తాను నటించలేనని..తాను ఏ పాత్ర పోషించినా? అది హుందాగా మాత్రవే ఉండాలంది. రష్మిక మాటల్ని బట్టి కొరియన్ సినిమాల్లో సెలక్టివ్ గా ఉంటుందన్నది స్పష్టమవుతుంది. కొరియాలో పద్దతైన పాత్రలా? కొరియన్ సినిమాలంటే? హద్దులు లేని సన్నివేశాలుంటాయి. రొమాంటిక్ సన్నివేశాలు..బెడ్ రూమ్ సన్నివేశాల్లో ఎలాంటి హద్దులు ఉండవు. ఎలాంటి




పాత్రలోనైనా వీలైనంత రియాల్టీ చూపించడం అక్కడ దర్శకుల ప్రత్యేకత. అందుకు తగ్గట్టే నటీనటులు పని చేస్తారు. అలాంటి సన్నివేశాలకు మాత్రం రష్మిక నో చెప్పేలా ఉందని ఆమె మాటల్ని బట్టి తెలుస్తోంది. పద్దతైన పాత్రల్లోనే నటించడానికి సిద్దంగా ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ ఇదంతా ఈజీ కాదు. పాత్రకు తగ్గట్టు నటి మౌల్డ్ అవ్వకపోతే అవకాశాలు కష్టం.



# బైకర్.. ఎవరా ప్రెట్టీ బేబీ?

చార్మింగ్ స్టార్ శర్వానంద్ ఈసారి ఫుల్ స్పీడ్‌తో రాబోతున్నాడు. తన కొత్త సినిమా 'బైకర్'తో బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి రెడీ అయ్యాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ లాంటి టాప్ బ్యానర్ నిర్మిస్తుండటంతో, ప్రాజెక్ట్‌పై మొదటి నుంచి మంచి బజ్ ఉంది. లేటెస్ట్ గా, మేకర్స్ ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేయనున్నట్లు అప్‌డేట్ ఇచ్చారు. ఇక 'బైకర్' సినిమాను డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు మరోసారి పోస్టర్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. ఈ అనౌన్స్‌మెంట్ కోసం వదిలిన పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇది రెగ్యులర్ యాక్షన్ పోస్టర్‌లా కాకుండా, ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో ఉంది. ఒక వింటేజ్ యమహా బైక్‌పై శర్వానంద్, ఒక అమ్మాయిని చాలా ఇంటెన్స్‌గా హగ్ చేసుకుని కనిపిస్తున్నాడు. శర్వా రఫ్ లుక్‌లో, బైకర్ జాకెట్‌తో స్టైలిష్‌గా ఉన్నాడు. ఆమె కూడా బైకర్ జాకెట్‌లో ఉన్నా, తన ఫేస్‌ను మాత్రం ఒక రెడ్ హెల్మెట్‌తో కవర్ చేసేసింది. ఈ పోస్టర్ ఫ్యాన్స్‌లో కొంత క్యూరియాసిటీని పెంచింది. "అసలు ఎవరా ప్రెట్టీ బేబీ?" అంటూ నెటిజన్లు డిస్కషన్ మొదలుపెట్టారు. దానికి తగ్గట్టే, ఫస్ట్ సింగిల్ పేరును కూడా "ప్రెట్టీ బేబీ" ( అని అనౌన్స్ చేశారు. ఈ "ప్రెట్టీ బేబీ" సాంగ్ ప్రోమోను నవంబర్ 11న రిలీజ్ చేయనున్నారు. ఆ పోస్టర్‌లోని హెల్మెట్ బేబీ ఎవరో తెలియాలంటే ఆ రోజు వరకు ఆగాల్సిందే. నిజానికి, ఈ సినిమాలో మాల్వికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోందని సమాచారం. మరి, ఆ హెల్మెట్ కింద ఉన్నది మాల్వికానేనా లేక సినిమాలో మరో సర్ప్రైజ్ హీరోయిన్ ఎవరైనా ఉన్నారా అనేది సస్పెన్స్‌గా మారింది. ఈ మిస్టరీ పోస్టర్‌తో 'బైకర్' టీమ్ ప్రమోషన్స్‌కు మంచి కిక్ ఇచ్చింది. ఫస్ట్ సింగిల్ ప్రోమోతో ఈ సస్పెన్స్‌కు తెర దించుతారేమో చూడాలి. సినిమాలో హై యాక్షన్‌తో పాటు, ఒక సాలిడ్ రొమాంటిక్ ట్రాక్ కూడా ఉండబోతోందని క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ జీబ్రాన్. గతంలో రన్ రాజా రన్, జిల్ వంటి సినిమాలకు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. ఇక ఈ సినిమాకు జిబ్రాన్ ఇచ్చే ఫ్రెష్ ట్యూన్స్, బీజీఎం సరికొత్తగా ఉండనున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. శర్వాకు ఒక మంచి మ్యూజికల్ ఆల్బమ్ పడి చాలా కాలమైంది, ఈసారి జిబ్రాన్ ఆ లోటును తీరుస్తాడేమో చూడాలి. అభిలాష్ రెడ్డి కంకర డైరెక్షన్‌లో రూపొందుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. శర్వానంద్‌కు ఈ సినిమాతో సాలిడ్ కంబ్యాక్ గ్యారెంటీ అని ఫ్యాన్స్ ఫిక్స్ అవుతున్నారు. ఇక సినిమాకు రాబోయే సాంగ్స్ ఏ స్థాయిలో హైప్ క్రియేట్ చేస్తాయో చూడాలి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications**, D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**